నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
గురువారం | 07 నవంబర్ 2024 | www.navatelangana.com

ఇంటింటి సర్వేకు వాస్తవ సమాచారం ఇవ్వాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక కుల గణన ఇంటింటి సర్వే విజవంతం చేయాలని న్యాల్‌కల్ మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి అన్నారు. సామాజిక ఆర్థిక కుల ఇంటింటి సర్వే రేజింతల్ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి మండల అధికారులు కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. రేజింతలు నిర్వహించిన గ్రామసభలో పారిశుద్ధ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు రావడంలేదని గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొత్త కాలనీలో నీటి సమస్య ఉందని మండల అధికారుల ముందు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి పలువురు మాట్లాడుతూ ఇంటింటి సర్వే పై అపోవాలు నమ్మవద్దన్నారు. పేదలకు లబ్ధి చేకూరేలా కుల గణన సర్వే చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భూపాల్, ఎంపీడీవో రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేజింతల్ శ్రీనివాస్ రెడ్డి, న్యామత బాద్ అప్పారావు పాటిల్, జగనాథ్ రెడ్డి, బలవంత్ రెడ్డి, ఉపాధ్యాయులు గురునాథ్, సఫియా సుల్తానా, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులున్నారు..

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-మునిపల్లి

హైదరాబాద్ నుంచి గుజరాత్ రాష్టానికి అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం లారీని పోలీసులు సివిల్ సప్లై అధికారులు, సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్, సివిల్ సప్లై అధికారి స్వరూప తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని కంకల్ టోల్ ప్లాజా వద్ద లారీని ఆపి చెక్ చేయగా 199.30 క్వింటాల్స్ స్వాధీనం చేసుకొని లారీ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపారు.

బీసీల పట్ల చిత్తశుద్ధిలేని కాంగ్రెస్

రాజకీయ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఎందుకివ్వలే
బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్



నవతెలంగాణ-సంగారెడ్డి

చిత్తశుద్ధి లేనిక కాంగ్రెస్ పార్టీ మొక్కుబడి కోసం బీసీ కుల గణన జపం చేస్తుందని సంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్, ఇతర నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఇన్నాళ్లకు బీసీలు గుర్తుకు వచ్చారా అని అడిగారు. రాష్ట్ర మంత్రివర్గంలో బీసీ జనాభాకు తగిన ప్రాతినిధ్యం ఎందుకు కల్పించలేదన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవుల్లో సైతం బీసీలకు సముచిత స్థానం కల్పించడానికి ఏ జనాభా లెక్కలు అడ్డువచ్చాయో చెప్పాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసి అడావుడి చేసిందన్నారు. ఆ తర్వాత సమాచారాన్ని దాచి పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే బీసీ కుల గణన అర్భాటం చేస్తుందన్నారు. సర్వేలో పేర్కొన్న ప్రశ్నలన్నింటికీ వివరాలు ఇస్తే ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు, రాయితీలు, అవకాశాల్లేకుండా పోతాయేమో అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. పథకాల్లో లబ్ధిదారుల్ని కుదించడం కోసం అనేక వివరాలు అడుగుతున్నారన్నారు. బీసీ జనాభా ఎంత ఉందో ప్రభుత్వ, రాజకీయ పదవుల్లో అంతే ప్రాతినిధ్యం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందా..? అని ప్రశ్నించారు. పదవులన్నీ అగ్రకులాల వాళ్లు పొంది పేరుకు బీసీ కుల గణన చేసినంత మాత్రాన ప్రయోజనముండదన్నారు. బీసీ కుల గణన పూర్తయిన తర్వాత వారి జనాభాకు తగినంతగా రాజకీయ పదవులు, ఆర్థిక ప్రయోజనాలు అందిస్తామని కాంగ్రెస్ అధిష్టానం చెప్పగలదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తన సామాజిక వర్గానికే అనేక పదవుల్ని కట్టబెడుతున్న సంగతి పార్టీ అధినేత రాహుల్ గాంధీకి తెల్వకుండా ఉంటదా అన్ని అన్నారు.

టిప్పర్ లారీ ఢీకొట్టి రిటైర్డ్ వీఆర్ఓ దేవయ్య మృతి

నవతెలంగాణ-తూప్రాన్





అతివేగంతో దూసుకొచ్చిన టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో తూప్రాన్ పట్టణానికి చెందిన రిటైర్డ్ వీఆర్ఓ బంగరుగల్ల దేవయ్య(60) ను బుధవారం ఉదయం మృతి చెందినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. ఉదయం 5.30 గంటల సమయానికి వాకింగ్ చేస్తూ వెళ్తున్న రిటైర్డ్ వీఆర్వో దేవయ్యను అతివేగంతో టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి.అదే సమయంలో ఆయనతో పాటు వాకింగ్ చేస్తూ వెంట ఉన్న మిత్రులు 108 కి ఫోన్ చేయడంతో,ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి హుటాహుటిగా తరలివచ్చిన అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినాడు. మృతుడు బంగరిగల్ల దేవయ్య గతంలో తూప్రాన్ మండల రెవెన్యూ శాఖలో వీఆర్ఓగా విధులు నిర్వహించి రిటైర్ అయ్యారు. దేవయ్య మృతికి కారణమైన టిప్పర్ లారీని తూప్రాన్ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్సై శివానందం తెలిపారు. రిటైర్డ్ వీఆర్ఓ దేవయ్య మృతిపై మున్సిపల్ చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ అధికారులు బంధువులు, మిత్రులు, అంబేద్కర్ సంఘం నాయకులు, తదితరులు భారీ సంఖ్యలో అంత్యక్రియలకు హాజరై సంతాపం వ్యక్తం చేశారు.

శ్రేయోభిలాషి సామాజిక సేవలు అభినందనీయం

శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ సేవలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తాయి



నవతెలంగాణ-ములుగు

ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవలు చేయడం అభినందనీయమని, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉమెన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఆకుల లలిత పేర్కొన్నారు. శ్రేయోభిలాషి సేవ ట్రస్టు దినదిన అభివృద్ధి చెంది భవిష్యత్తులో మరింత మంది సభ్యులతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని, తమ అండదండలు ఎల్లవేళలా ఉంటాయని నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో అన్నపూర్ణమ్మ తెలిపారు. బుధవారం ములుగు మండలం లక్ష్మక్కపల్లి లోని శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో సభ్యులతో నిర్వహించిన కిట్టి పార్టీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణు, జగతి వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు మైసమ్మ గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి వారు గోవులకు పూజ చేసి, గ్రాసం వేసి గో సేవ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో భవిష్యత్ ప్రణాళికల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి పోరెడ్డి మల్లేశం, కోశాధికారి గంప ఆంజనేయులు, సభ్యులు దోసపాటి గోపాల్, ఇందూరు తిరుపతి, వెంకటేశ్వర్లు, లక్ష్మీకాంతం, కర్ర వెంకటేశ్వర్లు, ఆకుల సుధాకర్, శ్రీరాములు, మధుసూదన్ రెడ్డి, మహేష్, సర్వే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని చిరు వ్యాపారులతో సమావేశం



నవతెలంగాణ-తూప్రాన్

చిరు వ్యాపారులతో మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, కమిషనర్ పి.గణేష్ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ తూప్రాన్ పట్టణంలోని చిరు వ్యాపారులు మెయిన్ రోడ్ పై ఎంక్రోచ్మెంట్ చేస్తూ, పూలబండ్లు, పండ్లబండ్లు , చిరు వ్యాపారం చేసే వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకోవడంతో వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ప్రయాణికులు వాహనదారులు అసౌకర్యానికి గురి కావడంతో పాటు పలుమార్లు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. కావున వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చిరు వ్యాపారులు పెట్టుకునే బండ్లను వెనక్కి జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్,కౌన్సిలర్ రవీంద్ర గుప్తా,చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రెగ్యులర్‌గా చెల్లించాలి

- జీవో నెంబర్ 51 ని సవరించాలి
- మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు
- కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా

నవతెలంగాణ-సంగారెడ్డి

గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని, ప్రతినెలా రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం డిపిఓ సూపర్డెంట్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డ్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఇంటి పన్నులు తదితర పనుల్లో వివిధ కేటగిరీల వారిగా పనిచేస్తున్నారని నేటికీ వీరికి కనీస వేతనం లేదన్నారు. గత ప్రభుత్వంలో పోరాటాల ఫలితంగా నెలకు రూ.9500/- ఇస్తున్నా, ఇవి కూడా రెగ్యులర్‌గా రావడం లేదని దీనితో పేద కుటుంబాలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకులు మారడం లేదని వెంటనే ఈ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం ఈఎస్ఐ పీఎఫ్ ప్రమాద బీమా రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ లాంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం కొద్దిపాటి వేతనాలు పెంచి మల్టీ పర్పస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని దీనివలన కార్మికులపై ఒత్తిడి పెంచి బలవంతంగా పనులు చేయిస్తున్నారని దీనితో అనేక జిల్లాలలో ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తున్న ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని జీవో నెంబర్ 51ని సవరించాలని మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని కారోబన్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని పంచాయతీ కార్మికుల వేతనాల చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రతినెల రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు లేనిచో మరో పోరాటం సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు విద్యాసాగర్ బాబురావు గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు సత్తయ్య, శంకర్ మహేష్ వీరేశం ఇమ్మానియేల్, అశోక్ నగేష్ లక్ష్మి, రాములు, కార్మికులు పాల్గొన్నారు.



కుల గణనతోనే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి

- స్వాతంత్ర్యం వచ్చాక దేశంలోనే మొదటిసారి కుల గణన
- భారత్ జోడు యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు కుల గణన
- దేశానికి ఆదర్శంగా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి
- సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన మంత్రులు.
- మంత్రులు కొండా సురేఖ, దామోదర్ రాజనర్సింహ

నవతెలంగాణ-సంగారెడ్డి/పటాన్‌చెరు

సమగ్ర కుటుంబ సర్వేతో బడుగు బలహీన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా రాజకీయపరంగా అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, అటవీ ,పర్యావరణ, దేవాలయ శాఖ మంత్రి కొండా సురేఖ లుఅన్నారు. బుధవారం ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే సంగారెడ్డి పట్టణం విద్యానగర్ కాలనీలోని వార్డు నెంబర్ 31లో మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడారు. స్వాతంత్రం వచ్చాక దేశంలోనే మొట్టమొదటిసారి తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. స్వతంత్రం రాకముందు బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో 1831లో కులగణన కార్యక్రమం నిర్వహించిందన్నారు. స్వతంత్రం వచ్చాక ఈ ప్రభుత్వం కొలగలనని చేపట్టలేదు అన్నారు. భారత్ జూడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుల గణన కార్యక్రమం చేపట్టిందన్నారు. నెల రోజుల లోపే ఈ సర్వే పూర్తికానున్నట్లు తెలిపారు. 29 రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రము ఆదర్శంగా నిలవాలన్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ను నియమించి కుల గణన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో సుమారు నాలుగు లక్షల పైచిలుకు కుటుంబాలుకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో 55 అంశాలకు సంబంధించి 75 ప్రశ్నలను వివిధ కోట రూపంలో ఎన్యుమరేటర్లు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా కులగనలతో పాటు ఆయా కుటుంబాల సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులు సేకరించనున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు రాష్ట్రంలో కులాలవారీగా జనాభా వారి ఆర్థిక రాజకీయ పరిస్థితులు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు ఈ సర్వేలో కులంతో పాటు ఉపకులం కూడా నమోదు చేయనున్నట్లు తెలిపారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కుల గణన జరగకపోవడంతో బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా రాజకీయపరంగా సామాజికపరంగా నష్టపోతున్నారన్నారు. కుల గణన చేసి జనాభా ప్రాతిపదికన ఆర్థిక సామాజిక పరిస్థితుల ఆధారంగా అట్టడుగు వర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎన్నో రోజులుగా ప్రజలు కుల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నప్పటికీ గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సుమారు 55 అంశాలకు సంబంధించి సర్వే జరుపనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో కులాలవారీగా, మతాలవారీగా ,కుటుంబాల ఆర్థిక, రాజకీయ, సామాజిక, స్థితిగతులను ప్రభుత్వం తెలుసుకొని వారి అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమాచారమంతా గోప్యంగా ఉంటుందన్నారు. సామాజిక లెక్క సరిగా ఉంటే, మన హక్కులను మనమే పొందవచ్చని తెలిపారు. సర్వే ద్వారా అన్నిసామాజిక వర్గాలకు సమన్యాయం అందుతుందన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి , అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా, పటాన్‌చెరులో నిర్వహించిన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎఫ్ఓ శ్రీధర్ రావు, తహసిల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరిఎ ఓపీవో హరి శంకర్ గౌడ్, చిట్కుల్ ఈఓ కవితతో పాటు జిల్లా, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ వివిధ మండల, బ్లాక్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



బోనస్ బోగస్ చేసి రైతులను ముంచాడు

- ధాన్యం దళారుల పాలైంది రైతులు అప్పుల పాలయ్యారు?
- సన్న రకం కొనలేదు? బోనస్ ఇవ్వలేదు?
- దేవుళ్లపై ఓట్లు పెట్టి డబ్బాలో ఓట్లు వేసుకున్నారు.
- ఉత్తంకుమార్ ఉత్త మాటలు రేవంత్ రెడ్డి అబద్ధం మాటలు

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

బోనస్ బోగస్ చేసి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా రూరల్ మండలం పరిధిలోని రాఘవపూర్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే హరీష్ రావు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులతో మాట్లాడి ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించారని నేడు చేతల్లో ప్రజలకు ఏమి చేయడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఇప్పటికే ఆలస్యం చేయడంతో రైతులు పెద్ద మొత్తంలో నష్టపోవడం జరుగుతుందన్నారు. గ్రామంలో దాదాపు నాలుగు నుంచి ఐదువేల క్వింటాలు ధాన్యాన్ని వేరే ప్రాంతంలోనే దళారులకు అమ్ముకున్నారని నెలరోజుల పాటు కేంద్రం ప్రారంభం కోసం గ్రామానికి చెందిన దేవయ్య, గోపాల్ రెడ్డి, బైతి యాదయ్య పలువురు రైతులు దళారులకు అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధరను కాదని క్వింటాలుకు రూ.1900లకు అమ్ముకోగా సుమారు రైతుల అతని ధాన్యంపై రూ.81 వేల పైచీలుకు నష్ట పోయిన పరిస్థితి నెలకొందన్నారు. దీనికి కారణం రేవంత్ రెడ్డి మోసం అబద్ధపు మాటలు చేతగానితనమేనన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి నేడు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. గొప్పలకు పోయిన రేవంత్ రెడ్డి నేటికీ పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ రైతు భరోసా వంటివి అందించక బోనస్ బోగస్ చేసి రైతులను మోసం చేశారన్నారు. నేడు ధాన్యం మొత్తం దళారుల పాలైందన్నారు వ్యవసాయ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తానని చెప్పాడు. కానీ ఇప్పటికే 30% ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సిద్దిపేట జిల్లాలో ఒక కిలో సన్న రకం దాన్యం కొనుగోలు చేశారా ఒక్కరికైనా బోనస్ ఇచ్చారా అని ప్రశ్నించారు. పని చేతగాక అన్ని అబద్ధాలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారన్నారు 25 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేస్తామని చెప్పిన ఉత్తంకుమార్ రెడ్డి అబద్ధపు మాటలు చెప్పారన్నారు. నేటికీ 50% పత్తి అమ్ముడుపోయిందన్నారు. ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కన్నీళ్లు పెట్టిస్తూ ఉసురు పోసుకుంటూ రాబందుల ప్రభుత్వంగా మారిందన్నారు. నేడు రైతులకు ప్రభుత్వంపై అనుమానం ఆందోళన నెలకొందన్నారు. యాసంగి వానాకాలం పంటలకు సంబంధించిన రైతు బంధు డబ్బులు ఎకరాకి రూ.15 వేల చొప్పున అందించాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తిట్లు లేకపోతే ఓట్లు మాత్రమే ఉంటాయని ఎక్కడికి వెళ్తే అక్కడ ఆగస్టు 15 రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్టు పెట్టి ఓట్లు డబ్బాలో వేసుకొని ప్రజలను మోసం చేశారన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ మా రెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీదేవి రామ్ చంద్రరావు రావు ,మాజీ సర్పంచ్ ఎర్వ రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కులగణన దేశంలోనే చారిత్రాత్మకం

- జిల్లాలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు...
- కులగణనతో అన్ని వర్గాలకు సముచిత న్యాయం...
- కులగణనను ప్రారంభించిన మంత్రి దామోదర్

నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్రంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పించేందుకు, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వేను చేపడుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం సాయంత్రం జోగిపేటలో కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 17,18,19 వార్డుల్లో పర్యటించిన మంత్రి కులగణనకు సంబంధించిన స్టిక్కర్‌లను ఇండ్లకు అతికించి, కుటుంబ సభ్యులకు సమగ్ర సర్వే ప్రాముఖ్యతను, అవశ్యకతను వివరించారు. సమగ్ర సర్వేను చేపడుతున్న అధికారులకు కుటుంబంలోని ప్రతి ఒక్కరి వివరాలను తెలియజేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ అదనపు కలెక్టర్ మనోజ్, ఆర్‌డీవో పాండు, మార్కెట్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి గీత, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, చైర్మన్ మల్లయ్య వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, ఆకుల చిట్టిబాబు, రంగా సురేష్, డి.శివశంకర్, కోరబోయిన నాగరాజ , హరికృష్ణాగౌడ్, దుర్గేష్, చందర్ , ఎంపీడీవో రాజేష్, ఎంపీవో అశోక్, మాజీ కౌన్సిలర్‌లు ప్రదీప్‌గౌడ్, శరత్‌బాబు, మాజీ వార్డు మెంబర్లు పి.ప్రవీణ్‌కుమార్, చింతగుంట .శివకుమార్, నాయకులు రామకృష్ణ, చిట్యాల మధు, రాజశేఖర్, సతీష్, రవి, శ్రీనివాస్, రాములుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



పర్యటనలో మంత్రికి వినతులు

సమగ్ర కుటుంబ, కుల గణన సర్వే ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి 17,18,19 వార్డుల్లో పర్యటించారు. ఆయా వార్డుల్లోని ప్రజలు వివిధ రకాల సమస్యలతో కూడిన వినతులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పట్టణానికి చెందిన మొచి సంఘం సభ్యులు స్థలం ఉన్నప్పటికీ, తమకు నూతన భవనం కోసం నిధులు మంజూరు చేయాలని కొరగా రూ.10 లక్షలను మంజూరు చేస్తానని మంత్రి హామీనిచ్చారు. మంత్రిని మసీదులోకి ఆహ్వానించిన ముస్లీం మత పెద్దలు బహదూర్ ఖాన్ ఫంక్షన్ హాల్ పునఃనిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని కొరారు. దీంతో ఆయన స్పందించి ముస్లీం మత పెద్దలతో కలిసి కమిటీని వేసి ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడదామన్నారు. మున్సిపాలిటీలో గత 30 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ విధానంలో కార్మికులకు పనిచేస్తున్న తమను పర్మినేంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కొరుతూ కార్మికులు మంత్రికి వినతి పత్రాన్ని అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం మహిళలతో కలిసి సమావేశమై పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కల్లుగీత సొసైటీలకు భూములు ఇవ్వాలి



మంత్రి దామోదర్‌కు కల్లుగీత కార్మిక సంఘం వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి

కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ , జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖని కలిసి కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, గౌడ సోదరుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కల్లుగీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్ పంపిణీ కార్యక్రమంలో వారు మంత్రులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల ప్రాణాలను కాపాడడం కోసం ప్రమాదాల నివారణకు కాటమయ్య సేఫ్టీ కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమని వారన్నారు. ప్రభుత్వం ఈత తాటి చెట్ల పెంపకం కోసం ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, ఇప్పటికే సర్టిఫికెట్ ఇచ్చిన కల్లుగీత సంఘాలకు భూమి పొజిషన్ చూపించాలని, జిల్లాలో నీర కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు కొత్త కల్లు షాపులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజన్న గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామ గౌడ్, కృష్ణా గౌడ్, సంగారెడ్డి మండల ఉపాధ్యక్షులు కృష్ణ గౌడ్, జిల్లా నాయకులు వెంకటేశం గౌడ్ శ్రీనివాస్ గౌడ్, వసంత్ గౌడ్, జగన్ గౌడ్ ,నరసింహ గౌడ్, వీరన్న గౌడ్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

హ్యుందాయ్ పరిశ్రమ స్థాపనకు మట్టి టెస్టులు

నవతెలంగాణ-ఝరాసంగం

జాతీయ ఉత్పాదక పెట్టుబడి మండలి (నిమ్జ్) ప్రాజెక్టులో ఏర్పాటు చేస్తున్న హ్యుందాయ్ పరిశ్రమ ఏర్పాటుకు ముందడుగులు పడుతున్నాయి. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామ శివారులో ఇప్పటికే టీజీఐసీ అధికారులు ఈ పరిశ్రమ ఏర్పాటుకు 409 ఎకరాలను కేటాయించారు. ఈ పరిశ్రమలో ఎలక్ట్రిక్ వాహనాల ను తయారు చేసేందుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం పరిశ్రమకు కేటాయించిన భూమిలో దాదాపు 50 పాయింట్లలల్లో 20 మీటర్ల లోతు వరకు డ్రిల్ చేసి మట్టి టెస్టులను చేసేందుకు టెక్నికల్ బృందం పనులను చేపట్టారు. దాదాపు ఈ నెల చివరి నాటికి టెస్టులను పూర్తి చేసి కంపెనీ పనులకు శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నట్లు విశ్వాసనీయ సమాచారం తెలిసింది.



గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను సన్మానించిన తోపాజి

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా గొల్ల అంజయ్య బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అంజయ్యను మాజీ ఉమ్మడి మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ తోపాజి అనంత కిషన్ శాలువాతో సన్మానించి సత్కరించారు.

యువత ఉపాధి అవకాశాలు సృష్టించుకోవడం అభినందనీయం

• బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం



యువత ఉపాధి అవకాశాలు సృష్టించుకోవడం అభినందనీయమని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి అన్నారు. బుధవారం జిన్నారం మండలం కొడకంచి గ్రామానికి చెందిన యువకుడు నవీన్ గౌడ్ ఏర్పాటు చేసిన వ్యాపార సంస్థను కౌన్సిలర్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వయంకృషితో ముందడుగు వేస్తూ ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం అభినందనీయమన్నారు. యువత తలుచుకుంటే అన్ని సాధ్యమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చంద్రారెడ్డిని,, స్థానిక నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెంటగౌడ్ (మాజీ సర్పంచ్), వడ్డె కృష్ణ (జిన్నారం మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు), రమేష్, రాజు, నాగరాజు, ప్రభాకర్, అభిలాష్ (తాజా మాజీ ఉప సర్పంచ్), నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

మంత్రుల సమక్షంలో శ్రీధర్ జన్మదిన వేడుకలు

• కేక్ తినిపించిన మంత్రులు దామోదర్, సురేఖ

నవతెలంగాణ-జోగిపేట



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అనుచరుడు, జోగిపేట కాంగ్రెస్ నాయకులు తాటికొండ శ్రీధర్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో జరిగిన వేడుకల్లో మరో మంత్రి కొండ సురేఖ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలను మంత్రులు తెలిపారు. అందోల్ నియోజకవర్గ, అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, మిత్రులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ- సదాశివపేట

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బుధవారం పార్టీ శ్రేణులతో కలసి శ్రీవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందించడంతో పాటు ఆశీర్వాదం అందజేశారు. తదనంతరం టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలసి, టీటీడీ చైర్మన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, మామిళ్ళ రాజేందర్, కొండల్ రెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

చట్ పూజలకు చెరుకు గడలు పంపిణీ

• కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి

నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం



బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వలస ప్రజలు ప్రతి ఏటా ఛట్ పూజలను ఘనంగా నిర్వహిస్తారు. బుధవారం పోచమ్మ బస్తీలోని దుర్గా మాత ఆలయంలో రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి ఛట్ పూజల నిమిత్తం చెరుకు గడలను బీహార్, ఒడిశా రాష్ట్ర వాసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతాలకనుగుణంగా నిర్వహించుకునే అన్ని వేడుకలకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. చట్ పూజలను జయప్రదంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దిననాథ్, శ్రీను, జె.జె సింగ్, లక్కన్, తివారీ, శ్రవణ్, ఒడిశా, బీహార్ రాష్ట్రవాసులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాకు భూమి పూజ



నవతెలంగాణ-హత్నూర

సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామంలో పల్లె దవాఖానాకు గ్రామ స్పెషల్ ఆఫీసర్ తహశీల్దార్ పర్విన్ షేక్ బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె దవాఖానాలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రతి గ్రామంలో పల్లె దవాఖానాలు ఉండాలనే సంకల్పంతో పక్కా భవనాలను నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పల్లె దవాఖానాల వల్ల గ్రామాలలో ఉన్న వృద్ధులు, వికలాంగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అన్నయ్య గారి రామచంద్రారెడ్డి, బైసాని వెంకటేశం గుప్తా, పూసల సత్యనారాయణ గౌడ్, సురేందర్ గౌడ్, గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి,, సంజీవరెడ్డి, కోటంల వెంకటేష్, పాతూరి రమేష్, కోర ప్రభుకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను ప్రారంభించిన కార్పొరేటర్ సింధు

నవతెలంగాణ-రామచంద్రాపురం:



సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటి ఇంటి కుటుంబ సర్వేను రామచంద్రాపురంలోని తన నివాసంలో బుధవారం భారతీ నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ప్రారంభించారు. యజమాని వివరాలతో పాటు 15 రోజులు 75 అంశాలపై ప్రతి కుటుంబం నుంచి పూర్తి వివరాలు ఎన్యుమరేటర్లు సేకరించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అనంతరం వారి ఇంటికి స్టిక్కర్ అంటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భారతి నగర్ వార్డు ఇన్చార్జి రమేష్, సూపర్వైజర్ నారాయణ, ఎన్యుమరెటర్లు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం

నవతెలంగాణ-చౌటకూర్



కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం చౌటకూర్ మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహిస్తూ అధికారులు ఇంటికి స్టిక్కర్లను అతికించారు. కులగణనలో భాగం గా సర్వే నిర్వహిస్తున్నట్లు ఎన్యూమరేటర్ అర్జున్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సర్వేలో కార్యదర్శులదే కీలక పాత్ర

• ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బలరాం

నవతెలంగాణ- అమీన్‌పూర్



తెలంగాణ రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేలో పంచాయతీ కార్యదర్శులే కీలక పాత్ర పోషిస్తున్నారని పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సందిల బలరాం తెలిపారు. గ్రామంలోని హౌస్ లిస్టింగ్‌లో అన్ని కుటుంబాలు ఎంట్రీ అయ్యేలా చూసుకుంటూ, ఒక పక్క ఎన్యుమరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మిగిలిన ఎన్యూమరేటర్లకు గ్రామ పరిస్థితిపై సమగ్ర సమాచారం అందిస్తూ పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే ను రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షులు సందిల బలరాం పిలుపునిచ్చారు.

టీ దుకాణం తొలగించాలని వినతి

నవతెలంగాణ-అమీన్‌పూర్



అమీన్‌పూర్ మున్సిపాలి టీ పరిధిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ భారత్ టీ దుకాణం, బాత్ రూమ్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతుందని, ఆ దుకాణాన్ని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. టీ దుకాణం వల్ల గుట్కాలు, సిగరెట్లు, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారని, దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని ఆలయ చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్ మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. దీనికితోడు రాత్రి 12 గంటల వరకు టీ పాయింట్ నడుపుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛ భారత్ టీ దుకాణాన్ని తొలగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

సంస్కారం లేని విద్య నిరర్ధకం

• రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
• గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా గొల్ల అంజయ్య పదవి స్వీకారం
• స్వాతంత్ర ఉద్యమంలో గ్రంథాలయ పాత్ర కీలకం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంస్కారం లేని విద్య నిరర్థకమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా గొల్ల అంజయ్య పదవీ బాధ్యతల చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ , దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో చైర్మన్ పదవీ బాధ్యతల స్వీకారం అనంతరం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో నేను, నాది, నా కుటుంబం, నా సంపాదన అనే భావం ఉంటున్నదని, ఇది ఆందోళనకరమని పేర్కొన్నారు. గతంలో ప్రజలలో మనం అనే భావన ఉండేదని మనం అనే భావన ఏకతకు బాటలు వేస్తుందన్నారు. పిల్లలకు విద్యతో పాటు సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. సంస్కారం లేని విద్య నిరర్థకం అన్నారు. విద్యతోపాటు విద్యార్థులకు ఏది మంచి ఏది చెడు అని తెలుసుకునే వివేకం అందించేది పుస్తకాలు మాత్రమేనన్నారు. మన దేశ స్వాతంత్ర ఉద్యమంలో గ్రంథాలయాలు కీలకంగా పనిచేశాయన్నారు. గ్రంథాలయాల ద్వారా చదువుకొని ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. ప్రతి వ్యక్తిలో ప్రశ్నించే తత్వం ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వం పెరిగితే విప్లవాలు వస్తాయన్నారు. అదే ప్రశ్నించే తత్వం పెరిగితే ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుందన్నారు. దీంతో దేశం అభివృద్ధి పథంలో ముందుకెళుతుందన్నారు. నేడు ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్‌లకు బానిసలు అవుతూ పుస్తకాలకు దూరమవుతున్నారన్నారు. పత్రికల్లో వచ్చే ప్రాధాన్యమైన వార్తలు సంపాదకీయం చదవడం లేదని వాట్సప్ చూస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. సి ఆర్ ఎఫ్ నిధులతో గ్రంథాలయాలకు పుస్తకాలు తెప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి



గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాల కొరత ఉందని గత పది సంవత్సరాల నుంచి గ్రంథాలయ సెస్ సెస్ ప్రభుత్వం నుండి రావడం లేదన్నారు. సిబ్బంది నియామకాలు లేక గ్రంథాలయాల నిర్వాహనకు ఇబ్బంది ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో గ్రంథాలయాలలో సమూల మార్పులు తీసుకొచ్చి రాబోయే రెండేళ్లలో జ్ఞాన సమాజాన్ని నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను సక్రమంగా నిర్వహించాలి

• ఎమ్మెల్యే మాణిక్ రావు

నవతెలంగాణ-ఝరాసంగం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు సక్రమంగా నిర్వహించాలని, ఏలాంటి తప్పులు లేకుండా ఆన్లైన్లో నమోదు చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని పంచాయితీ కార్యలయం ఆవరణలో సమగ్ర కుటుంబ సర్వేను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులకు, ఎన్యూమరేటర్లకు కుటుంబ సర్వే పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి యాజమాని వివరాలను తెలుసుకోని సరిగ్గా ఉన్నాయా లేవా అని పరిశీలించిన తరువాతే నమోదు చేయాలన్నారు. అదే విధంగా మండల కేంద్రమైన ఝరాసంగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసిల్దార్ కార్యాలయాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రికార్డులను, సిబ్బంది హాజరు శాతాన్ని ఆయన పరిశీలిం చారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మెన్ శివకుమార్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని లలితా కుమారి, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపిడివో సుధాకర్, మాజీ ఎంపిపి దేవిదాస్, కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు, మాజీ సర్పంచ్ జగదీశ్వర్, మాజీ ఎంపిటిసి రజనిప్రియ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్‌లో ఇంటింటా సర్వే

• మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి

నవతెలంగాణ-అమీన్‌పూర్



అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర కులగణన సర్వే విజయవంతంగా కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి తెలిపారు. బుధవారం ఇంటింటి కులగణన సర్వేను పలు వార్డుల్లో పర్యటించి పరిశీలించారు. ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబాల వివరాలను సేకరించారు. అయా కుటుంబాల ఆర్థిక, సామాజిక వివరాలను సేకరించారు. కుటుంబాల వివరాల సేకరణలో భాగంగా... ఆ కుటుంబానికి ఉన్న ఆస్తులు ఎన్ని? అప్పులు ఎన్ని? ఆదాయం ఎంత వస్తుంది? ఆ ఇంట్లో ఎంతమంది ఉంటారు? ఆ కుటుంబం నుంచి విదేశాలకు వెళ్లిన వారు ఉన్నారా? ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారు ఉన్నారా? ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వారు ఉన్నారా? ఇలా మొత్తం 75 రకాల ప్రశ్నలతో సమాచారం సేకరిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి పేర్కొన్నారు. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నారు. అలాగే కుటుంబంలోని ప్రతి ఒక్కరి ఫోన్ నెంబర్, వారు చేసే వృత్తి, ఉద్యోగం వివరాలను నమోదు చేస్తున్నారు. కుటుంబంలో విదేశాలకు లేదా ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారు ఉంటే... ఉద్యోగం కోసం వెళ్లారా? వ్యాపారం కోసం వెళ్లారా? అనే వివరాలను కూడా అడిగి తెలుసుకుంటున్నారు. కుటుంబం నుంచి ఏ దేశానికి వెళ్లారో తెలుసుకొని... ఒక్కో దేశానికి ప్రభుత్వం ఇచ్చిన కోడ్‌ను నమోదు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్వో మధుసూదన్ రెడ్డి, పలువురు సూపర్వైజర్లు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు ప్రజల సహకరించాలి

నవతెలంగాణ-హత్నూర



మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో ఇంటింటి కుటుంబ సర్వేను జడ్పీ సీఈవో, మండల స్పెషల్ ఆఫీసర్ స్వప్న బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ద్వారా పూర్తి వివరాలు ప్రభుత్వం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలను ఇంటింటికి చేరాలనే ఉద్దేశంతోనే సర్వే నిర్వహించడం జరుగుతుందని, అందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని ఆమె కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికిగాని ఎంపీడీవో దృష్టికిగాని తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇంటింటి సమగ్ర సర్వే ప్రారంభించి గోడలకు స్టిక్కర్స్ అంటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, మాజీ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, దుర్గం గౌడ్, సుధాకర్ రెడ్డి, కొన్యాల సతీష్, బిట్ల మహేష్, సాయికుమార్, అజీజ్, ఇబ్రహీం, ధనుంజయ గౌడ్, అంగన్వాడి టీచర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎస్సీ అసోసియేషన్ అభినందనలు

నవతెలంగాణ-రామచంద్రాపురం



బీహెచ్ఈఎల్ టౌన్షిప్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన సందర్భంగా బీహెచ్ఈఎల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నవ్యశ్రీ వాలీబాల్ పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా శైలేంద్రనాథ్, జోగేందర్ , బాల సాయి, సందీప్ లు హాకీ అండర్ 14కు ఎంపికైనారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రిన్సిపల్ రాముడు అధ్యక్షతన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షులు సురేందర్ మాట్లాడుతూ చదువులకు క్రీడా పోటీలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అసోసియేషన్ తరపున సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవా అర్జున్ ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు బస్సును ప్రారంభించిన మంత్రులు

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా మెడికల్ కళాశాలకు సిఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన బస్సును బుధవారం రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు కొండా సురేఖ , రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ బస్సు అందుబాటులోకి రావడం వల్ల మెడికల్ విద్యార్థుల రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, ఇది విద్యార్థుల ప్రయాణ సౌలభ్యానికి తోడ్పడుతుందని మంత్రులు తెలిపారు.సిఎస్ఆర్ నిధులు వినియోగించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు మెడికల్ కళాశాల సేవలు విస్తరించడానికి ఒక గొప్ప అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గీతామాధురి , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో శివుని విగ్రహం ఏర్పాటుకై వినతి



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణం నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే జాతీయ రహదారి జంక్షన్‌లో శివుని విగ్రహం ఏర్పాటు కొరకు 30 గుంటల స్థలం కేటాయించాలని పట్టణ పురపాలక ప్రజలు కోరిక మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్‌కు పలువురు స్థానికులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిల్ల మల్లన్న, పవన్ కుమార్ గౌడ్, రవీంద్రనాథ్ రాందాసి, వెంకటేశం గుప్తా, రాచన్న స్వామి, మహేష్ స్వామి, బరాడి తిరుపతి, కంది మల్లేశం, నాగరాజు, మల్లికార్జున శంకర్, పాండురంగారెడ్డి, రజనీకాంత్, విష్ణువర్ధన్ రెడ్డి, కృష్టారెడ్డి, పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-హత్నూర



సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దేవుని గుట్ట తండాలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రామచందర్ తెలిపారు. అధ్యక్షులుగా బానోత్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా సంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సింగ్ లోకనాథం, జ్యోతి, కార్యదర్శులుగా గంగరాజు, పద్మారావు, వెంకటేశం, ప్రసన్న, జిల్లా కౌన్సిలర్‌గా గణేష్, రజిని, గణేష్, గౌసోద్దీన్, మల్లప్ప, నరేష్, మాధురి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా నరేష్, సభ్యులుగా వేణుగోపాల్, ప్రవీణ్, అకాడమిక్ కన్వీనర్‌గా వాసవి, సభ్యులుగా శ్వేత, జీవోల కమిటీ కన్వీనర్‌గా సత్యనారాయణ, సభ్యులు ప్రేమలత, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్‌గా మంజుల, సభ్యులు సంధ్యారాణిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులు రవీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం ప్రయత్నం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

1కాలనీల అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దాం

• అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

నవతెలంగాణ-అమీన్ పూర్



అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా విలీనమైన గ్రామ పంచాయతీల పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, ప్రణాళికాబద్ధం గా నిధులు కేటాయిస్తామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. బుధవా రం మున్సిపల్ పరిధిలోని కృష్ణారెడ్డిపేట, శ్రీకృష్ణ నగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో రహదారులు, అంతర్గత మురుగు నీటి కాలువలు, మిషన్ భగీరథ మంచినీరు అందించేందుకు ప్రణాళి కలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతోనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మాజీ ఎంపీపీ ఈర్ల దేవానందం, మాజీ సర్పంచ్ కృష్ణ, కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లూరు యాదగిరి, మాజీ ప్రజా ప్రతినిధులు, కాలనీవాసులు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-పటాన్‌చెరు

నేడు పట్టణంలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు బుధవారం పట్టణ ఏఈ జగదీశ్వరరావు తెలిపారు. 33/11కేవీ పటాన్ చెరు పట్టణ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కె.వి టౌన్ ఫీడర్ మెయింటెనెన్స్, కొత్త సర్వీసులు రిలీజింగ్ చేయడం, చెట్లు కొట్టి వేయటం వంటి మరమ్మతులు ఉన్నందున శాంతినగర్ ఫీడర్ పరిధిలో శ్రీనగర్ కాలనీ , శ్రీ రామ్ నగర్ కాలనీ, శాంతి నగర్ కాలనీలలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు 33/11కేవి పటాన్‌చెరు పట్టణ సబ్‌స్టేషన్ నుంచివచ్చే విద్యుత్తు (03:00 గంటలు) విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. 11కేవి ఆల్విన్ ఫీడర్ పరిధిలోని పాత మార్కెట్, గౌతమ్ నగర్, జాతీయ రహదారి,లక్కి దొడ్డి, గోకుల్ నగర్, గోల్ల బస్తీ, చైతన్య నగర్ కాలనీ, శివాలయం, వెల్వోన్ డెన్సన్, డెన్సన్, సీతారామపురం కాలనీలలో మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 04:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు ఎలక్ట్రిసిటీ సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

రామచంద్రాపురం: రామచంద్రాపురం ప్రాంతంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ తిరుపతమ్మ తెలిపారు. మెయింటెనెన్స్, చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు హెచ్ఐజి, ఎల్ఐజి, ఎంఆర్ఎఫ్ కాలనీ, మాక్ సొసైటీ ప్రాంతాలలో..... అదేవిధంగా మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు రామచంద్రారెడ్డి నగర్, నాగులమ్మ గుడి ప్రాంతం, స్నేహ లేక్ వ్యూ అపార్ట్మెంట్స్, ఎస్ఎస్ 1 అండ్ 2 జిహెచ్ఎంసి కార్యాలయం ప్రాంతం, బీడీఎల్ క్వార్టర్స్, అపార్ట్మెంట్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంది. కావున వినియోగదారులు , సహకరించగలరని తెలిపారు.

జిన్నారం: ఉమ్మడి జిన్నారం మండలంలోని గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏడిఈ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈనెల 7న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఉంటుందని చెప్పారు. జిన్నారం, సోలక్ పల్లి, శివనగర్,బొంతపల్లి, వీరన్న గుడెం,దోమడుగు ప్రాంతాల్లో 33/11 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు పారిశ్రామికవేత్తలు గ్రామీణులు పరిస్థితిని గుర్తించి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిన్నారం బొంతపల్లి ఏఈలు వెంకటేశ్వర్లు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామీణ మహిళలకు బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-సంగారెడ్డి

బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్‌లో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సంగారెడ్డిలో నెలరోజుల పాటు మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు ఎస్.బి.ఆర్.ఎస్.ఇ.టి.ఐ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఉచితభోజన, ఉచిత వసతి కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నవంబర్ 23వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490103390,9490129839లను సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలి

నవతెలంగాణ-కొండపాక



విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించడానికి కృషి చేయాలని కుకునూరుపల్లి ఎంఈఓ బి.సత్తయ్య అన్నారు. కుకునూరు పల్లి మండలంలోని కొనయపల్లి, వడ్డెర కాలనీ, కాశనగర్ ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కనీస సామర్థ్యాలైన రాయడం, చదవడం, గణిత భావాలను పెంపొందించాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉశాలత, పద్మ, రాజేశ్వరరావు సీఆర్‌పీ సంతోష్ ఉన్నారు.

నవతెలంగాణ
3
మెదక్
గురువారం | 07 నవంబర్ 2024 | www.navatelangana.com

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ధాన్యం కొనుగోళ్లు

- నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి

నవతెలంగాణ-కొల్చారం



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కొల్చారంతో పాటు వరిగుంతం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దాన్ని కొనుగోలు నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని తెలిపారు. ఆడియో వెంట సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ప్రగతి, తహశీల్దార్ గఫ్ఫూర్, ఆర్ఐ ప్రభాకర్, సొసైటీ సీఈవోలు రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్

నవతెలంగాణ-చిలిపిచేడ్



సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నాగేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటికి స్టిక్కర్స్ అతికించారు. మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ పర్యవేక్షించారు, సమగ్ర కుటుంబ సర్వేలో ఏ విధమైన ప్రశ్నలు అడగాలో ఏ ఏ కార్డులు పరిశీలించి ఫారం నింపాలో ఎన్యుమరేటర్లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ముసాదిక్, ఎంపీడీవో ఆనంద్, ఏపీవో శ్యాం కుమార్, డిఎల్పిఓ యాదయ్య, ప్రాథమిక పాఠశాల టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలన

- తహసీల్దార్ ఎంపీడీవో.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



మండల కేంద్రమైన పెద్ద శంకరం పేటతో పాటు గ్రామాలలో బుధవారం ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మండల తహసీల్దార్ గ్రేసి బాయ్ ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా తదితర అధికారులు పరిశీలించారు. ఇంటింటికి తిరుగుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో సంబంధిత అధికారులు కుటుంబ యజమానుల పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు ఇంటింటికి సమగ్ర సర్వే స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఆర్ఐ శరణప్ప పంచాయతీ కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణం కావొద్దూ

- ఎస్సై శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-పాపన్నపేట

రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమైతే చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన యూసుఫ్ పేట వద్ద ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రాత్రివేళ ధాన్యం కుప్పలపై నల్లని టార్పాలిన్ కప్పి ఉంచడం వల్ల అవి వాహనదారులకు కనిపించక పెద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వేరే చోట ధాన్యం ఆరబోసుకోవాలన్నారు. ధాన్యం కుప్పల వద్ద ప్రమాదాలు జరిగితే చర్యలు తప్పవన్నారు. రైతులు సహకరించాలని సూచించారు. కానిస్టేబుళ్ల బస్వరాజు, నర్సింలు, ప్రవీణ్, తదితరులున్నారు.

రగ్బీ క్రీడలో రాష్ట్ర స్థాయికి ఎన్నిక

నవతెలంగాణ-చేగుంట



పట్టణ కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జిఎఫ్ రగ్బీ క్రీడల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి అండర్ 17 బాయ్స్ నరేష్, అరుణ్ అండర్ 17, గర్ల్స్‌లో దివ్య, గాయత్రి, అండర్ 14 బాయ్స్ నవనీత్, సాయికుమార్ అండర్ 14 గర్ల్స్ అశ్విత ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి విద్యార్థులను చేగుంట ఎంఈఓ నీరజ, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రఘుపతి, ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, రమాదేవి, రమ, చల్లా లక్ష్మణ్, భవాని, మనోహర్ రావు, సరస్వతి, సురేందర్, వెంకటేష్, రేఖ, శ్రీవాణి, ఉమా దేవి, ఉమామహేశ్వరి వారిని అభినందించారు.

నిజాంపేటలో ప్రారంభమైన ఇంటింటి సర్వే

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టినటువంటి కుల గణన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం ప్రారంభిం చారు.గ్రామంలో పలు వార్డులో ఇంటిం టికి తిరుగుతూ ఉపాధ్యాయులు సీరియల్ నెంబర్ స్టిక్కలను అతికించారు. ప్రతి ఇంటికి ఒక నెంబర్ అతికించిన అధికారులు మరో రెండు రోజుల్లో సర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

నవతెలంగాణ-టేక్మాల్



చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం 6:30కి చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బంటు విట్టల్ (60) సంవత్సరాలు ఇతనితో పాటు ముగ్గురు చేపల వేటకు గ్రామ పరిధిలోని పూరచెరువులో చేపలు పడుతున్న సమయంలో కాళ్లకు చేపలు పట్టే వల చుట్టుకొని నీటిలో మునిగి చనిపోయాడు. విట్టల్ మృతికి కారణం గ్రామానికి చెందిన గంగారం రాములు, బంటు దుర్గేష్, దిగాల బేతాయలే కారణమని విట్టల్ కుటుంబీకులు బంధువులు గంగారం రాములు పై దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న టేక్మాల్ ఎస్సై రాజేష్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని నీటిలో నుంచి బయటకు తీసి కుటుంబీకులకు అప్పజెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ అన్నారు.

ప్రమాదవశాత్తూ నీట మునిగి మహిళ మృతి

నవతెలంగాణ-పాపన్నపేట



ప్రమాదవశాత్తూ కుంటలో మునిగి ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు పాపన్నపేట గ్రామానికి చెందిన ఉప్పరి భవాని(36) కొన్నేళ్లుగా మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో కూలీ పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. భవాని ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. గ్రామ శివారులో ఉన్న కొత్తకుంట వద్ద బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందింది.తిరిగి ఇంటికి రాకపోయేసరికి భవాని అపుడపుడు గాంధీ ఆస్పత్రికి వెళ్లి అక్కడే ఉండి మందులు తీసుకొని వచ్చేది. దీంతో ఆస్పత్రికి వెళ్ళిందేమో అనుకున్నారు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని కొత్తకుంట వద్ద నీటిలో మహిళా మృతదేహం అటుగా వెళ్లిన వారికి కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. భవానిగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి అన్న నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఏడు ఇండ్లలో చోరీ

- బంగారం వెండి నగదు అపహరణ
- ఎస్సై రాజు కేసు నమోదు

నవతెలంగాణ-వెల్దుర్తి



తాళం వేసి ఉన్న ఏడు ఇండ్లలో చోరీ జరిగిన సంఘటన మండల పరిధి ఉప్పులింగాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నట్లు ఎస్సై రాజు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుధవారం తెలిపారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన ఏడుగురు ఇండ్లకు తాళం ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని ఇదే అదునుగా భావించి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి పెద్ద నరసింహులు ఇంట్లో రెండున్నర తులాల బంగారం, 45 వేల నగదు, కుంట్ల ముత్యాలు ఇంట్లో ఐదు తులాల వెండి గొలుసు, దొంగలించారు. మిగతా ఐదుగురు ఇండ్లలో తల కొక్కుల శ్రీనివాస్, తలకొక్కుల దత్తు, వంచ లక్ష్మారెడ్డి, సత్తి వినోద, సత్తి సుధాకర్, ఇండ్లలో చోరీకి యత్నించి ఏమి దొరకక ఎలాంటి నగదు, బంగారం, దొంగలించబడలేదని ఆయన తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా ఉద్యమాలలో మహిళా కేరటం నర్సమ్మ

- సీపీఐ(ఎం) కార్యదర్శి బి.నర్సమ్మ

నవతెలంగాణ-మెదక్



ఎన్నో ఒడిదుగులను ఎదుర్కొంటూ ఉద్యమాలలో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి నేడు సీపీఎం పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన కడారి నర్సమ్మ నవతెలంగాణ విలేఖరి ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట గ్రామంలో నిరుపేద కూలి కుటుంబమైనా కడారి బాషయ్య, యాదమ్మలకు దంపతులకు నర్సమ్మ, నాగరాజు ఇద్దరు సంతానం.తనతో పాటు తమ తమ్ముడు కడారి నాగరాజు సీపీఐ(ఎం) పార్టీ ఉద్యమంలో నర్సాపూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా పనిచేస్తున్నారు. తన తమ్ముని పెంచి పెద్ద చేసి, చదివించి పెళ్లి చేసి కుటుంబ బాధ్యతలు అప్పగించి తాను ఉద్యమాల్లో అడుగు పెట్టారన్నారు. తను చదువుకోవడానికి అవసరమైన పుస్తకాలకు డబ్బులు లేక పై తరతుల విద్యార్థుల వద్ద పాత పుస్తకాలు తీసుకుని చదువును కొనసాగించారు.అమ్మ, నాన్నలు కూలి పనులు, తునికి ఆకు అమ్మి ఇస్తరాకులుకుట్టి కుటుంబాన్ని పోషించారు.వారి కష్టానికి ఫలితంగా ఎలాంటి సమస్యలొచ్చిన ఒంటరిగా ఎదుర్కోవం జరిగిందన్నారు. చదువుకునే రోజుల్లో ఇంట్లో కరెంటు కూడా లేని పరిస్థితిలో కిరోసిన్ దీపం కింద చదువు కొనసాగించారు. చదువుకునే రోజుల్లో అప్పటి పాఠ్యపుస్తకాల్లో మదర్ థెరిస్సా జీతం సేవ భావాలు ఒంటబట్టి తన వంతుగా ప్రజలకు ఏదైనా సేవ చేయాలనే ఉద్దేశంతో 1994లో 10 తరగతి పూర్తయిన వెంటనే అంగన్‌వాడీ టీచర్‌గా 1994లోనే జాయిన్ అయ్యారు. అంగన్‌వాడీ విధులు నిర్వహిస్తు డిగ్రీ పాసైయ్యారు. ప్రభుత్వ టీచర్‌గా పనిచేయడానికి అర్హత పరీక్ష రాసి పాసై తను టీచర్ ఉద్యోగానికి చేయడానికి అవకాశం ఉన్న ప్రజా సంఘం కోసం తాను త్రున ప్రాయంగా ఒడుపుకున్నానని తెలిపారు.ఎన్నో అవకాశాలు వచ్చినప్పటికీ కార్మిక వర్గ ప్రయోజనాల కోసం తనవంతు కృషి చేయాలనే ఉద్దేశంతో వదులుకున్నారాన్నారు. గ్రామంలో టీచర్‌గా, ఆశా కార్యకర్తగా, ఐకెపి వివోఏగా తాను విధులు నిర్వహిస్తు నిరంతరం ప్రజల్లో ఉండేవారు.అదే సమయంలో సీఐటీయు పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై రంగారెడ్డి బోధించిన దోపిడీ క్లాసు ప్రభావంతో పార్టీ విధానం పట్ల, సుందరయ్య జీవితం త్యాగం మరికొందరి మహనీయులు చేసిన పోరాటాలు, త్యాగాల వైపు ఆకర్షితులయ్యారు.17 సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్‌వాడి టీచర్ ఉద్యోగానికి 2011 సంవత్సరంలో రాజీనామా చేసి పార్టీ ఉద్యమల్లోకి పూర్తి కాలం కార్యకర్తగా పార్టీ లోకి వచ్చారు. ప్రజల సమస్యల పట్ల అవగాహన పెంచుకుంటూ సీపీఐ(ఎం) సభ్యత్వం పొందారు.మండల శాఖ కార్యదర్శిగా, నర్సాపూర్ డివిజన్ అధ్యక్షురాలిగా, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు,గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పై పనిచేస్తున్నారు. ముదిగొండ వీరుల భూపోరాట సందర్భంగా ఉమ్మడి రాష్ట్ర పిలుపులో భాగంగా మెదక్ జిల్లా కోల్చారం మండలంలోని కొంగోడు గ్రామంలో 33 దళిత కుటుంబాల పోరాటం లో పార్టీ ధర్నాలో మారుపేరు నర్మదా పేరుతో ప్రత్యక్షం గా పాల్గొని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నా సందర్భంగా పోలీసుల అరెస్టులు అయ్యారు. నేడు ఒక్కో కుటుంబానికి 3 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమిని రెండు బోర్లు వేసుకుని పంటలు పండించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా, జిల్లాలు విడిపోయాక అల్లదుర్గ్ , టెక్మాల్, పాపన్నపేట మండాలకు ఉపయోగపడే గుండు వాగు సాగునీరు కోసం ప్రత్యక్షంగా పోరాడా రు. దీని ఫలితంగా అప్పటి ఆర్థిక మంత్రి హరీష్ రావు స్పందించి మాట్లాడేలా గుండు వాగుకు బడ్జెట్ కేటాయింపులు చేస్తామని చెప్పారు. అనేక కార్మిక పోరాటాలు నిర్వహిస్తున్నారు.వ్యక్తి గత జీతాన్ని పార్టీ ఉద్యమాలకు అంకితం చేసి ఒంటరి మహిళగా సమస్యలను అధిగమిస్తూ ముందుకెళ్తున్నారు.ఉమ్మడి జిల్లా విడిపోయిన తర్వాత సంగారెడ్డి నుంచి మెదక్ జిల్లాకు 2016 అక్టోబర్ నెలలో వచ్చారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా ,కార్యదర్శి సభ్యులుగా తను భాద్యతలు నిర్వర్తిస్తున్నారు. వ్యక్తిగతంగా ఎన్ని సమస్యలొచ్చిన,ఆటంకాలు ఎదురైనా ఒంటరిగా, ఒంటరి మహిళగా తాను ఎదుర్కొని ఉద్యమాల్లో కొనసాగుతున్నారన్నారు. చిన్నప్పుడు తన తల్లి దండ్రులు పెంచిన తీరు గాని, క్రమ శిక్షణ గాని తనకు ఉపయోగపడిందన్నారు. నవంబర్ 2,3 తేదీలలో తుప్రాన్ పట్టణంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి గారి ప్రాంగణంలో జరిగిన పార్టీ జిల్లా 15వ మహాసభలో తనను అన్నారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి శయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.

సన్నవడ్లు కొనేదెవ్వరు?

- కొనేది ఎప్పుడు?
- క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామంటేనే సన్న వడ్లు పెట్టాను
- ఇప్పుడు కొనే నాధుడే కరువయ్యాడు
- వ్యాపారస్తులు తక్కువకు కొంటాం అంటున్నారు
- ప్రభుత్వము వెంటనే సన్న వడ్లను కూడా కొనే విధంగా చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-నిజాంపేట



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు క్వింటాలకు రూ.500లు బోనస్ ఇస్తామంటేనే సన్న వడ్లు పెట్టామని రైతులు పేర్కొన్నారు. వరి చేనులు కోసి దాదాపు 15 రోజులు అవుతున్నందున నేటికీ వడ్లు కొనుగోలు చేయకపోవడం చాలా బాధాకరమైన విషయమని రైతులు వాపోతున్నారు. మండలంలో అనేకమంది రైతులు సన్నవడ్లు వేశారని వాటిని కొనడానికి ప్రభుత్వము ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వము ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడం వలన రైస్ మిల్లుల యాజమాన్లతోని మాట్లాడకపోవడం వలన రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారని, ప్రైవేట్ వ్యాపారస్తులు తక్కువ ధరలకు వడ్లను కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దొడ్డు రకం వడ్లు వేసిన బాగుండేదని కొందరు రైతులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వము అధికారులు స్పందించి వెంటనే సన్నరకం వడ్లు కొనుగోలు చేసేలా తగు చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

సన్న రకం వడ్లను వెంటనే ప్రభుత్వము కొనుగోలు చేయాలి



వరి చేనులు కోసి దాదాపు 15 రోజులు అవుతుందని వడ్లు వర్షానికి తడుస్తున్నాయని వెంటనే ప్రభుత్వము సన్న రకం వడ్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వమును కోరుకుంటున్నాను. క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామంటేనే సన్న రకం వడ్లు వేశామని దాదాపు 2 లారీల వరకు సన్న రకం వడ్లు,2 లారీల దొడ్డు రకం వడ్లు వచ్చాయని వడ్లను ఆరబెట్టడం కుప్పలు చేయడం అనేక ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే ప్రభుత్వము సన్నరకం వడ్లను కొనుగోలు చేయాలి.

జిట్టి రమేష్ రైతు నిజాంపేట వాసి

గ్రామపంచాయతి సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

- జీ.ఓ నెంబర్ 51ని సవరించాలి
- మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి
- గ్రామపంచాయతి కార్మికుల మహా దీక్షలు



నవతెలంగాణ-మెదక్ టౌన్

గ్రామపంచాయతి కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవో నెంబర్ 51 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, 11వ పిఆర్సి ప్రకటించిన విధంగా జీవో నెంబర్ ప్రకారం గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో దీక్షలు నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ నాగేష్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె వైకుంఠధామాలు, ఇంటి పనులు, భూమిశిస్తులు, మార్కెట్ల నిర్వహణ, దుకాణాల పన్నుల వసూలు, ఆఫీస్ నిర్వహణ, తదితర పనుల్లో, కేటగిరీల వారీగా గ్రామపంచాయతీ కార్మికులు పనులు చేస్తున్నారన్నారు. జీవో నెంబర్ 51వెంటనే సవరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా తమ ప్రాణాలను సైతం ధారబోస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామపంచాయతీ కార్మికులు సేవలందిస్తున్నారన్నారు. 11వ పిఆర్సి ప్రకటించిన విధంగా జీవో నెంబర్ 60 ప్రకారం గ్రామపంచాయతి కార్మికులకు కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. తరాలు మారుతున్నాయి తప్పా కార్మికుల బతుకుల్లో ఎలాంటి మార్పు లేదని కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామపంచాయతీ కార్మికులకు అమలు కావడం లేదన్నారు. 2019 అక్టోబరులో గత రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 51ని విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500కు పెంచిందన్నారు. వేతనాలు పెంచుతూనే పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాళ్ళను బిగిస్తూ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మల్టీపర్పస్ వర్కర్లుగా మార్చిన తర్వాత ఎవరైనా ఏ పనినైనా చేయాలని, నిబంధన పెట్టి కార్మికులపై ఒత్తిడి పెంచి బలవంతంగా పనులు చేస్తున్నారన్నారు. ఇతర పనులపై వారికి నైపుణ్యం లేకపోయినా అనేక ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తున్నా, మరణించిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం కూడా చెల్లించడం లేదన్నారు. ఆ కార్మికుల కుటుంబాలను ఆదుకునే దిక్కు లేక రోడ్డున పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లాలోని గ్రామపంచాయతి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, గ్రామపంచాయతి కార్మికులు, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి తహసీల్దార్ జ్ఞానజ్యోతి వ్యవసాయ అధికారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో పిఎసిఎస్ ద్వారా ప్రారంభమైన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టిన అనంతరమే కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని సూచించారు. తిరిగి బియ్యాన్ని మీకే అందజేయడం జరుగుతుందని మంచి బియ్యమే కావాలంటారు. అందుకు మీరు కూడా సహకరించాలని సూచించారు. త్వరితగతిన తూకం వేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునే బాధ్యత మండల అధికారులపై ఉందన్నారు. సన్నాలను కొనుగోలు కేంద్రాలకు తీసుకోవచ్చు బోనస్ పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేసిన బ్యాంకు అధికారులు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన బందారం నాగరాజు గత ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. మృతుడు స్థానిక ఏపీజీవీబీ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకానికి అర్హుడు కావడంతో బ్యాంక్ సిబ్బంది బుధవారం మృతిని, భార్య బందారం మనస్వినికి ప్రమాద బీమా రెండు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ క్యాషియర్ రవి మనోహర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియం చేసుకోవాలి. ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలకు ఇట్టి పథకాలు భరోసా కల్పిస్తాయన్నారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన తాజా మాజీ సర్పంచ్ జెల్లా రజిత లక్ష్మణ్ గౌడ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మురళీకృష్ణ, అకౌంటెంట్ స్వాతి, ఫీల్డ్ ఆఫీసర్ నిఖిల్ వెంకటేష్, బ్యాంకు మిత్ర రవి, నవీన్, జెల్లా లక్ష్మణ్ గౌడ్, జెల్ల కృష్ణ స్వామి గౌడ్, బంగారం పరుశరాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వే ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ-వెల్దుర్తి



తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఉమ్మడి మాసాయిపేట్ వెల్దుర్తి మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ప్రారంభమైంది. ప్రతి గ్రామపంచాయతీలో 150 ఇండ్లకు ఒక బ్లాక్ ఏర్పాటు చేసి దానిలో మండల స్థాయి అధికారులు మానిటరింగ్ చేసుకుంటూ ఉమ్మడి కుటుంబాల నుంచి ఎంతమంది విడిపోయి ఎంతమంది వేరుగా జీవిస్తున్నారని ప్రక్రియ మొదలుపెట్టారు. గ్రామాల్లో డోర్ టు డోర్ స్టిక్కలను అతికించారు. మండలాల్లోని గ్రామపంచాయతీ సెక్రటరీలు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్లు ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపీవో స్పెషల్ అధికారులుగా కొనసాగారు.

సమగ్ర కుటుంబ సర్వే హౌస్ స్టింగ్‌ను పరిశీలించిన ఆర్డీఓ

నవతెలంగాణ-నార్సింగి



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర ఇంటింటి సర్వేలో భాగంగా నేడు హౌస్ స్టింగ్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని మూడు రోజులలో పూర్తి చేయడం జరుగుతుందని, స్థానిక ఎంపీడిఓ ఆనంద్ తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న హౌస్ స్టింగ్‌ను తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర రెడ్డి పరిశీలించారు. అనంతరం ఎంపిడిఓ ఆనంద్ మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో ప్రజలు సహకరించాలని సర్వే నిర్వహించనున్న సిబ్బందికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, జిరాక్స్ పత్రాలు ఇవ్వాలని ప్రతి ఒక్కరు సహకరించి సర్వే పూర్తయ్యే విధంగా చూడాలని కోరారు. మండల కేంద్రంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ కరీం, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీధర్, నార్సింగి గ్రామ పంచాయితీ కార్యదర్శి నాగభూషణం, బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తనివ్వొద్దు

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కౌల్చారం



రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు కొల్చారంలోని జైన దేవాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా ఈనెల 9న మాజీ మంత్రి హరీష్ రావు కొల్చారం మండలంలో పర్యటిస్తున్నట్లు నేపథ్యంలో చిన్న ఘనపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గౌరీశంకర్, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, ముత్యంగారి సంతోష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి యువజన అధ్యక్షులు సంతోష్ రావు, రవితేజ రెడ్డి, ఆంజనేయులు, కాశీనాథ్, తదితరులు ఉన్నారు.


సమస్యలను నివృత్తికి కంట్రోల్ రూమ్ ప్రారంభం

24 గంటలు అందుబాటులో
కంట్రోల్ రూమ్ నెంబర్ 9281103685
అదనపు కలెక్టర్ నగేష్

నవతెలంగాణ-మెదక్

వరి ధాన్యం కొనుగోలు, పర్యవేక్షణకు కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ప్రారంభించడం జరిగిందని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించడానికి కొనుగోలు సమస్యలు ఎక్కడైనా ఏర్పడిన పక్షంలో కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసినట్లయితే కంట్రోల్ రూమ్‌లో రిజిస్టర్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. వెంటనే సమస్య నివృత్తి చేసి రైతులకు కొనుగోలు ఇబ్బంది లేకుండా పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందని సిబ్బంది విధుల్లో ఉంటారని రైతులు ఎటువంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట డిఎం సివిల్ సప్లై హరికృష్ణ, డి సి ఎస్ ఓ సురేష్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం



నవతెలంగాణ-నార్సింగి: మండల పరిధిలోని జప్తి శివనూర్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని జప్తి శివునూర్, కాసులాపుర్, శంఖాపూర్ గ్రామాలలో గురువారం విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈసీ.హెచ్ స్వామి తెలిపారు. గురువారం ఉదయం 9 గం,, నుంచి మధ్యాహ్నం 12 గం,, వరకు 33/11 కేవీ జప్తి శివనూర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు చేయనున్నా మని, అందువల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంద ని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఎట్టకేలకు వరి కొనుగోలు ప్రారంభం రైతుల హర్షం

నవతెలంగాణ-నార్సింగి



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కోతలు కోసి ఇరవై రోజులు కావస్తున్నా, అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్నా, కొనుగోలు కేంద్రాలు లాంఛనంగా ప్రారంభించి పక్షం రోజులు గడుస్తున్నా కొనుగోలు జరగడం లేదని, తమ గతి ఎలా అని అటు రైతులు ఆవేదన చెందుతున్న తరుణంలో, ఇటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళనలు చేయడానికి సన్నద్ధం అవుతున్న తరుణంలో ఎట్టకేలకు మండల వ్యాప్తంగా ఐకేపీ, పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో బుధవారం వరి కొనుగోలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం అశోక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు ఐకేపీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అన్ని కొనుగోలు సెంటర్‌లలో వరి కొనుగోలు ప్రారంభించామని తెలిపారు. ఐకేపీ సెంటర్‌లలో రైతులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, రైతులు తమ వడ్లను ప్రభుత్వ సూచనల మేరకు ఆరబోసి త్వరగా తూకం అవడానికి సహకరించాలని కోరారు. రైస్ మిల్లుల అల్లోట్మెంట్స్ కలెక్టర్ కార్యాలయం నుంచి బుధవారం తమకు అందనున్నట్లు అశోక్ తెలిపారు. వరి కొనుగోలు ప్రారంభించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి కొనుగోలు ప్రక్రియను పలు కొనుగోలు సెంటర్లలో స్థానిక తహశీల్దార్ షేక్ కరీం, ఎంపిడిఓ ఆనంద్ సందర్శించి పరిశీలించారు..

అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-చిన్న శంకరంపేట



మండలంలోని కొరివిపల్లి గ్రామంలో బుధవారం అనారోగ్యంతో యువకుడు ఆత్మహత్య గురించి చోటు చేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరివి పల్లి గ్రామానికి చెందిన ముత్తిగళ్ళ లాలు తండ్రి కిష్టయ్య వయసు 25 సంవత్సరాలు ఇతను నవంబర్ 4న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్ళిపోయాడు. తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై నారాయణ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సిద్దిపేట
4
గురువారం | 07 నవంబర్ 2024 | www.navatelangana.com

సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి



- దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్

నవతెలంగాణ-రాయపోల్

సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. మంగళవారం రాత్రి దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో సైబర్ నేరాల పట్ల అవగాహన, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు వాడకం, మహిళల రక్షణ, షీ టీమ్స్ పనితీరు వంటి అంశాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, యాంటీ హ్యుమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందన్నారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత. యువత చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిసకావద్దన్నారు. డ్రగ్స్,గంజాయి ఇతర మత్తు పదార్థాల అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సాయిలు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయులను కేటాయించాలని డీఈఓకు వినతిపత్రం



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని వల్లంపట్ల ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోపరేటివ్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ ఆలేటి యాదగిరి, ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్‌ల ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వల్లంపట్ల పాఠశాలలో పనిచేస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులు బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లగా వారి స్థానంలో ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే బదిలీపై వచ్చారని, విద్యార్థులకు పూర్తిస్థాయి స్టాఫ్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ఒక స్కూల్ అసిస్టెంట్ ఇద్దరు ఎస్జీటీలను నియమించాలని కోరారు .ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బొడ్డు రవీందర్, ముస్తాల రవి, ఎండి సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

- జెడ్పీసీఈఓ రమేశ్
- రేగులపల్లిలో పలు గృహాల సందర్శన



నవతెలంగాణ-బెజ్జంకి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని జెడ్పీ సీఈఓ రమేశ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని రేగులపల్లి గ్రామంలో గృహాల సంఖ్య వివరాలను తెలుసుకునేందుకు జెడ్పీ సీఈఓ రమేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీసీఈఓ మాట్లాడుతూ 9న సమగ్ర కుటుంబ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేస్తారని తెలిపారు. ఎంపీడీఓ ప్రవీణ్, సూపరిండెంట్ అంజయ్య, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

ఈఎంటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిద్దిపేట

108 అంబులెన్స్ వాహనంలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల ఉద్యోగాల నియమకాల కొరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్దన్, ఇన్చార్జ్ ఈఎంఈ అఫ్రోజ్‌లు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని బురుజు దగ్గర (పాత ఎంసిహెచ్ హాస్పిటల్) స్వచ్ఛ బడిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామనీ తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ లైఫ్ సైన్స్, జీఎన్ఎం, బీఎస్సీ డీఎంఎల్టీ, బీఫార్మసీ విద్యా అర్హతలు ఉండి, 20 నుంచి 35 ఏండ్లలోపు గల అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. సమాచారం కోసం 9100799265, 9154918139, 9000650045 సంప్రదించాలని సూచించారు.

గృహ ప్రవేశానికి హాజరైన ప్రముఖులు



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నూతన గృహ ప్రవేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ గృహ ప్రవేశానికి మాజీ ఎఫ్డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గామిడి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి,మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్, బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, మర్కుక్ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్ గౌడ్, మాజీ సర్పంచులు అచ్చంగారి భాస్కర్, గడ్డం ప్రసాద్, కాంగ్రెస్ మర్కుక్ గ్రామాధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డి, తదితరులున్నారు

మురికి కాలువల నిర్మాణానికి కృషి



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మురికి కాలువ నిర్మాణానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. బుధవారం అయ్యప్ప నగర్‌లో మురికి కాలువలు ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరగా మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఈ పరిస్థితులు ఉన్నాయని అన్నిటికీ మరమ్మతులు చేపడతామని, అభివృద్ధికి కాలనీవాసులు సహకరించాలని కోరారు. అదేవిధంగా సీసీ రోడ్ల విషయం సైతం పరిశీలన చేస్తామని చెప్పారు.గతంలో కమిషనర్ దృష్టి కూడా తీసుకుపోయినట్లు చైర్మెన్ దృష్టికి కాలనీవాసులు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప నగర్ అసోసియేషన్ సభ్యులు రామచంద్రం, మల్లేశం, బండ్ల స్వామి తదితరులు ఉన్నారు.

వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది



నవతెలంగాణ-మర్కుక్

రైతులు పండించిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్‌లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని దామరకుంట, మర్కుక్ గ్రామాల్లో పీఏసీఎస్ అద్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్ రెడ్డి, కాంగ్రెస్ దామరకుంట గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్, కాంగ్రెస్ మర్కుక్ గ్రామాధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యాక్షులు ర్యాకం యాదగిరి, నాయకులు కృష్ణ యాదవ్, పత్తి బాబు, మాదరి బాలనర్సయ్య, వనం అంజనేయులు, చేప్యాల యాదగిరి, శంకర్, నర్సింలు, కిషోర్, ఏఈఓలు రజని కాంత్, విష్ణు వర్ధన్, రైతులు, తదితరులున్నారు.

దొంగతనం కేసులో నిందితుడికి రిమాండ్

- ఎస్సై అపూర్వ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ఆటో దొంగతనం కేసులో నిందితుడిని 24 గంటల లోపు పట్టుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అపూర్వ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఇరుకోడు గ్రామానికి చెందిన మండల గోపి అనే వ్యక్తి ఆటో ఏపీ23ఎక్స్6973ను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారని మంగళవారం సిద్దిపేటరూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చాడు. ఫిర్యాదు దరఖాస్తు మేరకు 303(2) బీఎన్ఎస్ (దొంగతనం కేసు) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తును ప్రారంభించిన 24 గంటలు లోపే ఇర్కోడ్ గ్రామానికి చెందిన నిందితుడైన మాట్ల రాజు అనే వ్యక్తినీ సీసీ కెమెరాల సహాయంతో పట్టుకున్నారు. అతని దగ్గర నుండి ఆటోను రికవరీ చేసి, సదరు వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ దొంగతనాలకు సంబంధించిన కేసులను చేధించడంలో సీసీ కెమెరాలు యొక్క ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల ముందు, వ్యాపార సముదాయాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



నవతెలంగాణ-మర్కుక్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తిలో బుధవారం సికింద్రాబాద్ చెందిన మర్క నవీన-సురేష్ సాగర్ దంపతులు రాష్ట్రీయ గ్రామీణ సంస్కృతి మిషన్ (సగర అసోసియేషన్) సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలోని 260 మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను మండల విద్యాధికారి వెంకట రాములుతో కలసి పంపిణీ చేశారు. వీరు ప్రతి ఏడాది సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు విద్యా బోధన నోపకరణలను వితరణ చేశారు. పేద విద్యార్థుల అభివృద్ధి కొరకు తాము ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయులు లతీ సైదా, ఉపాధ్యాయులు షాబోద్దీన్, యాదిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఫణీంద్రుడు, విద్యాకర్ రెడ్డి, బాల నర్సయ్య, షాబుద్దీన్, శ్రీవిద్య, రమా దేవి, సంతోష, రజిని, శైలజ, కృష్ణవేణి, లావణ్య , పేటి రజిని, విద్యార్థులు, తదితరులున్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- జీఓ నెం.51ని సవరించాలి
- మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కామునిగోపాలస్వామి



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఎల్‌పిఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి మాటాడుతూ పంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంటు విడుదల చేయాలి. పంచాయతీ కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదు. కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడం లేదు. మల్టీపర్పస్ వర్కర్ పేరుతో అనేక పనులు చేయిస్తున్నారు. బకాయి వేతనాల సమస్య తీవ్రంగా ఉన్నది. కావున ప్రభుత్వం జోక్యం చేసుకొని పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సేవలను గుర్తించాలని, పంచాయితీ సిబ్బంది పర్మినెంట్, జీఓ నెం. 51ని సవరణ, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, పంచాయతీ కార్మికుల వేతనాల ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాల చెల్లింపులలో జరుగుతున్న జాప్యంపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం స్పందించి తక్షణమే గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన-పోరాటాలతో పాటుగా నిరవధిక సమ్మెకు సిద్ధమౌతామని ప్రభుత్వాన్నీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అమ్ముల బలనర్సయ్య, జీపీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బర్మ కొమురయ్య, తునికి మహేష్‌లు, జిల్లా నాయకులు శంకర్, కనకయ్య, ప్రభాకర్, రాజమౌళి, బాల్రాజు, బాలనరసవ్వ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జగదేవపూర్

పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని, ప్రతి రైతు పాడి దిగుబడితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని పశు వైద్యులు డాక్టర్ శ్వేత, వినయ్ సూచించారు. మండల పరిధి తీగుల్ గ్రామంలో బుధవారం పశు వైద్య, పశుసంవర్థక శాఖ పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పశువుల్లో వచ్చే గర్భాశయ, దూడల మరణాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పాడి దిగుబడికి పశువు ఆరోగ్యమే మూలమన్న విషయాన్ని ప్రతి రైతు గుర్తించాలన్నారు. పశువులకు కాలానుగుణంగా సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి టీకాలను వేయించాలని రైతులను కోరారు. 14 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 28 పశువులకు సాధారణ చికిత్సలు, 6 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించి మందులను అందించారు. 14 దూడలకు నట్టల నివారణ మందులను తాగించినట్లు తెలిపారు. అలాగే 58 నల్ల, 147 తెల్ల పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, గోపాలమిత్ర సూపర్ వైజర్ భాస్కర్ గౌడ్, ఓఎస్ హరిప్రసాద్, గోపాలమిత్రాలు యాదగిరి, సర్వర్ ఖాన్, గౌరీ, కనక స్వామి గ్రామ రైతులు పాల్గొన్నారు.

వరి పంటలో జాగ్రత్తలపై వివరణ



నవతెలంగాణ-జగదేవపూర్

మండలంలో కొన్ని గ్రామాల్లో రైతులు వరి కోతలు చేపడుతున్నారు. ఈ తరుణంలో వరి కోతల సమయంలో రైతుల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మండల వ్యవసాయ అధికారి యు.వసంతరావు అనంతసాగర్‌లో బుధవారం వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట కోతకి వారం లేదా 10 రోజుల ముందు నుంచే నీటి తడిని ఆపివేయాలి. కంకిలో 90 శాతం గింజలు పక్వానికి వచ్చాకే వరి కోతకు వచ్చినట్లు నిర్ధారించుకొని పంట కోత చేపట్టాలి అన్నారు. గడ్డి పొడి పొడిగా, గింజలు బంగారు రంగులోకి ఎర్ర గొలుసుగా మారి కంకులు కిందికి వంగినప్పుడు కోతలు చేపట్టాలి. పంట పక్వానికి రాకముందే కోస్తే, కంకిలోని అన్ని గింజలు పూర్తిగా నిండక తాలు ఎక్కువ వచ్చి దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అలాగే మరీ ఆలస్యంగా పంట కోస్తే చేను పడిపోయి గింజ ఎక్కువగా రాలి దిగుబడి తగ్గే అవకాశం ఉంది అన్నారు. పంట కోత సమయంలో గింజలో 22-27 శాతం తేమ ఉంటుంది. నూర్పిడి చేశాక తేమశాతం తగ్గించేందుకు 3 నుంచి 4 రోజుల వరకు ఎండలో ఆరబెట్టాలి. నూర్పిడి చేసిన తర్వాత ఒక్కసారైనా తూర్పారు పట్టుకోవాలి. దీనివల్ల ఏవైనా పంట అవశేషాలు, తాలు గింజలు కలుపు గింజలు, కీటకాలు వ్యర్థాలు ఉంటే తొలగి స్వచ్ఛమైన విత్తనం వస్తుంది. నూర్పిడి చేసే సమయంలో ధాన్యపు పంటల్లో గడ్డి జాతి గింజలు లేకుండా చూసుకోవాలి. కోత, నూర్పిడి సమయంలో ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి నూర్పిడి అయిన వెంటనే ధాన్యాన్ని టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ పట్టల పై పల్చగా ఆరబెడితే గింజ రంగు మారకుండా నల్లగా కాకుండా మంచి నాణ్యత కలిగి ఉంటుందని తెలిపారు. మార్కెట్లో కనీస మద్దతు ధర రావాలంటే కొన్ని జాగ్రత్తలు, అధికారులు సూచించిన ప్రమాణాలు పాటించాలని దీనిలో భాగంగా దెబ్బతిన్న, మొలకెత్తిన, పుచ్చు పట్టిన గింజలు 4 శాతం మించకుండా చూసుకోవాలని తెలిపారు.

దీర్ఘకాలంగా ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

- ఎస్టీఓ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా



నవతెలంగాణ-చేర్యాల

దీర్ఘకాలంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ చేర్యాల మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం. అంజిరెడ్డి, కే. రాజి రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం చేర్యాల మండల కేంద్రంలోని ఎస్టీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రభుత్వం ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన తక్షణమే పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని తమ మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్న సమస్యల్లో కేవలం నెల మొదటి తేదీకి వేతనాలు, పెన్షన్లు చెల్లించడం తప్ప మిగతా సమస్యలు పరిష్కరించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్‌ల్లో ఒకటి మాత్రమే ఇస్తామని ప్రకటించడం పట్ల ఉద్యోగులు, పెన్షనర్లు నిరాశ నిస్పులకు లోనయ్యారని తెలిపారు. సమస్యలపై ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విధి లేని పరిస్థితుల్లో దశల వారి కార్యక్రమాలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బి.బాల్ రెడ్డి, జి.పాండురంగం, పి.యాదయ్య, వి.రామబ్రహ్మం, ఆర్.సుదర్శనం, కే.ఎల్లారెడ్డి, ఎస్.రామచంద్రరావు, ఉదయ ప్రకాష్, ఏ.సుదర్శనం, ఏ.యశోద తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

- తెగుళ్ల నివారణకు రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలి
- ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ .ఎస్. శ్రీదేవి



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

వివిధ పంటల లో సోకుతున్న తెగుళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి నివారణకు రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ ఎస్ శ్రీదేవి సూచించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రావురుకుల గ్రామంలో శాస్త్రవేత్తలతో కలిసి వరి, కంది, శనగ, ఉలవలు, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వరి గింజ గట్టిపడే దశ (సన్న రకాలు) నుంచి కోత దశలో (దొడ్డు రకాలు) ఉన్నందున కాటుక తెగులు, కంకి నలి, ఆకు ముడత పురుగు సోకుతుంది. దాని నివారణకు ఫ్లుబెండమైడు0.3 మీ.లి లేదా కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 50 ఎస్పీ 2 గ్రా. లేదా ఎసిపేట్ 75 ఎస్పీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. కంకి నల్లి గింజలపై నల్లటి మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గుతుంది. కావున స్పైరోమైసిపెన్ 1 మీ.లి ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. కందిలో పూ మొగ్గ దశలో మరుకా మచ్చల పురుగు ఆకులూ, పూలను కలిపి గుళ్ళుగా చేసి కాయలను తొలిచితింటుంది. కావున దీని నివారణకు ఫ్లుబెండమైడ్ 40 మి.లీ. లేదా స్పైనోసాడ్ 60 మి.లీ. 200 లీటరు నీటికి కలిపి ఎకరాకు పిచికారి చేయాలి. వేరుశనగ, ఉలువలో లద్దె పురుగు ఆకు అడుగు బాగాన ఉండి గోకి తినడం వల్ల ఆకులు జల్లెడగా మారుతాయి. దీని నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి. లీ. లేదా నోవాల్యురాన్ 1 మి. లీ లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమాదేవి, పల్లవి, సరిత మండల వ్యవసాయ అధికారి నరేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు


అందమైన చేతి రాత సాధ్యమే



నవతెలంగాణ-దుబ్బాక

అందమైన చేతి రాత అందరికీ సాధ్యమేనంటూ చేతిరాత (హ్యాండ్ రైటింగ్)ను ఎలా రాయాలో చెబుతూ పలు మెలకువలు నేర్పించారు ప్రముఖ చేతి రాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులో జెడ్పీహెచ్ఎస్ లో నిర్వహించిన చేతిరాత శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎజాజ్ అహ్మద్ పాఠశాల విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో చేతిరాతలో సరికొత్త పద్ధతులను నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన 'అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే' అన్న పుస్తకాలను పలువురు విద్యార్థులకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంఈఓ జోగు ప్రభుదాస్, పాఠశాల హెడ్మాస్టర్ ఎండీ సాదత్ అలీలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పల్లె శ్రీనివాస్ గౌడ్, కృష్ణమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, నరేష్, బాలకృష్ణ, పద్మావతి, అశోక్, శైలజ, దినేష్, చంద్రశేఖర్, రాజేందర్, నవీన్ పలువురు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని శ్రీ సత్య సాయి విద్యాలయంలోని విద్యార్థులకు జాగృతి దినోత్సవం సందర్భంగా సైబర్ నేరాలు, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్టు ఎస్ఐ క్రిష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ నూతన చట్టాలపై అవగాహన కలిగియుండాలని ఎస్ఐ తెలిపారు. విద్యాలయ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను బలపరచండి

- రైతు భరోసా రుణమాఫీ అమలు పరచాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-కొండపాక

ప్రజా ఉద్యమాలతోనే నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయని, అందుకే ప్రజా ఉద్యమాలను బలపరచాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ అన్నారు. ఆ పార్టీ దుద్దెడ గ్రామంలో మండల మూడో మహాసభ జగపతి నాగరాజు, మూడోజు కనుక చారి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ అనంతరం ఉమ్మడి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి, యాదవ రెడ్డి, శశిధర్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. మండలంలో కుటీర పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తదితర సమస్యల పైన ఈ మహాసభలో తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు పూను కోవాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ రైతులందరికీ మాఫీ చేయడంలో లోపాలు ఉన్నాయని 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదని, ఆరు గ్యారెంటీల అమలకు స్పష్టమైన ప్రణాళిక లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఎర్రజెండా నీడలో ఉద్యమాలకు సిద్ధం కావాలని అన్నారు. సీపీఐ(ఎం) మండలంలో అన్ని వర్గాల, తరగతుల,ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుంది అన్నారు. అనంతరం పార్టీ ఉమ్మడి మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక ఉమ్మడి మండల సీపీఐ(ఎం) నూతన కార్యదర్శిగా అమ్ముల బాల్ నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాల్ నర్సయ్య మాట్లాడుతూ పార్టీ నమ్మకంతో పెట్టిన భాధ్యతను ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడుతానన్నారు. సభ్యులుగా మూడోజు కనకాచారి, జగపతి నాగరాజు, మీసా ఐలయ్య, తాటోజు రవీంద్రచారి, కొమురయ్య, ప్రభాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బండకంధి ఆరుణ్ కుమార్, చొప్పరి రవి కుమార్, దాసరి ప్రశాంత్ నాయకులు దాసరి బాలమల్లు, గజబింకరి బాలకిషన్, దొమ్మాట రోడ్డ బెల్లమయ్య మూత ఎల్లయ్య, జక్కుల నర్సింలు, పోశయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకిచ్చే నిజమైన నివాళి అని పత్రిక సంపాదకులు ఎన్ వేణుగోపాల్ ఉన్నారు. బుధవారం హుస్నాబాద్ జేఏసీ ఆధ్వర్యంలో కవ్వ లక్ష్మారెడ్డి సభాధ్యక్షులుగా ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన సాయిబాబా దాదాపు 40 కి పైగా ఐక్యవేదికలు నిర్మించడాన్నారు. బడుగు బలహీన ఆదివాసి వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసి ప్రజల పక్షాన నిలబడిన నిజమైన సామాజిక విప్లవ కారుడన్నారు. ప్రజల వైపు నిలబడిన వాళ్లను ప్రజలే కాపాడుకొని తమ హక్కుల కోసం ముందుకు సాగాలని అన్నారు. అప్పుడే సాయిబాబాకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, కోకన్వీనర్లు మేకల వీరన్న యాదవ్, డ్యాగల సారయ్య సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కెడం లింగమూర్తి, కే.రవిచందర్, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్క అనిల్ గౌడ్, పౌర హక్కుల సంఘం నాయకులు మాదాని కుమారస్వామి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలి

- సిద్దిపేట సీపీ అనురాధ



నవతెలంగాణ-అక్కన్నపేట

మండలం పోలీస్ స్టేషన్‌ను సిద్దిపేట సీపీ అనురాధ బుధవారం సందర్శించారు. సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, రికార్డులు తనిఖీలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క కేసులో పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని, వచ్చిన ప్రతి దరఖాస్తుకు రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అంకితభావంతో విధులు నిర్వహించాలని తెలియజేశారు. సిద్దిపేటను గంజాయి, మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్దులై ఉండాలని అన్నారు. సైబర్ నేరాలపై, మంత్ర తంత్రాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం విజబుల్ పోలీసింగ్ విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే గ్రామాల్లో మండల కేంద్రాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై నిఘా పెట్టాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూసే బాధ్యత పోలీసులందరిపై ఉందని అన్నారు. ముఖ్యంగా ప్రజల రక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించాలని తెలియజేశారు. అంతేకాకుండా స్కూల్, కాలేజీ, బస్టాండ్ ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. సీసీటీ ఎన్ఎస్‌లో డాటాను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని తెలియజేశారు. మీసేవ ద్వారా వచ్చినటువంటి దరఖాస్తులను డిస్పోజల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సతీష్, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, శ్రీధర్ గౌడ్, సీసీఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, కోర్టు లైజనింగ్ ఇన్స్పెక్టర్ కమలాకర్, అక్కన్నపేట ఎస్సై విజయ్ భాస్కర్, హుస్నాబాద్ ఎస్సై మహేష్, కోహెడ ఎస్సై అభిలాష్, సీసీ నితిన్ రెడ్డి, కానిస్టేబుళ్లు, తదితరులు, పాల్గొన్నారు.

మున్సిపల్‌లో మొరంకు డబ్బులు లేవా..?

- చాలా రోడ్లలో నరకం అనుభవిస్తున్న ప్రజలు
- సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి



నవతెలంగాణ-గజ్వేల్

మున్సిపల్‌లో మట్టి రోడ్లపై నడవడం ప్రజలు నరకం అనుభవిస్తున్నారని కనీసం మొరం పోయడానికి కూడా డబ్బులు లేవా..? అని సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో కనీసం మొరం కూడా పైసలు లేకుంటే మున్సిపాలిటీ ఎందుకని ఆయన ప్రశ్నించారు. వర్షాకాలంలోమట్టి రోడ్లు దెబ్బతిన్నాయని పత్రికల్లో వచ్చిన మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అయ్యప్ప నగర్, లక్ష్మీ ప్రసన్న నగర్, బాలాజీ తదితర కొత్త కాలనీలు చాలా వరకు ఉన్నాయని మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోలేదన్నారు. పాత రోడ్ల తొలగించి కొత్త రోడ్లను వేశారని కానీ మట్టి రోడ్లపై సీసీ రోడ్లు వెయ్యలేకపోయినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని అభివృద్ధి చేయాలంటే నిధులు లేవని చేతులు ఎత్తేస్తుందన్నారు.

పాలకులు విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారు

- ఏఐఎస్ఎఫ్ జిల్లాధ్యక్షులు సంగెం మధు



నవతెలంగాణ-బెజ్జంకి

పాలకులు విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారని ఏఐఎస్ఎఫ్ జిల్లాధ్యక్షులు సంగెం మధు ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లాధ్యక్షులు సంగెం మధు అధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు మహేష్, సంజయ్, ఉమేష్ చంద్ర, రాఘవేంద్ర, సాత్విక్, నరేష్, మమత, నవ్య పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల జీఓ164 రద్దు చేయాలి

-ఆర్పీల సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీమతి



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో మున్సిపల్ మెప్మా ఆర్పీలు వారధులుగా పనిచేస్తున్నారని, అదే తరహాలో ప్రభుత్వం ఆర్పీల సమస్యలు పరిష్కరించి అండగా ఉండాలని, జీవో 164 రద్దు చేయాలని రాష్ట్ర పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్పీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంకణాల శ్రీమతి డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేటలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలో మెప్మా విభాగంలో ఆర్పీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జీఓ 164 రద్దు చేసి వీఓఏ తరహాలో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఇదే అంశంపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, ఇతర మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి నెల మెప్మా ఆర్పీలకు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళ సంఘాల బలోపేతానికి, ఆర్థిక పరిపుష్టతకు కృషి చేస్తున్న ఆర్పీల కష్టం గుర్తించాలని కోరారు. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. జీఓ164 వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం క్యాబినెట్‌లో చర్చించి జీఓ164 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చొరవ చూపి న్యాయం చేయాలని కోరారు.

పోలీస్ కళాబృందంచే కనువిప్పు కార్యక్రమం

నవతెలంగాణ-నంగునూరు



మండలం రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘనపూర్ గ్రామంలో మంగళవారం పోలీస్ కళాబృందంచే కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాలపేట ఎస్సై అసీఫ్ మాట్లాడుతూ మద్యం తాగడం వల్ల కలిగే నష్టాలు, కుటుంబ కలహాలు,పేకాట ఆడుట వలన కుటుంబలో జరుగుతున్న పరిణామాలు, వరకట్నం వలన జరుగుతున్న సంఘటనలపై వివరించారు. రోడ్లపై ధాన్యం పోసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం సభ్యులు కలసి రోడ్డు ప్రమాదాలు మంత్రాలు, తంత్రాలు, మూఢనమ్మకాలు గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాల గురించి పాటలు నాటకం రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విజయ్ కుమార్ కర్వాకు నివాళ్లర్పించిన హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట మార్వాడి సమాజ్ పెద్దలు, ప్రముఖ వ్యాపార వేత్త విజయ్ కుమార్ కర్వా గుండె పోటుతో మృతి చెందగా, ఆయన మృత దేహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాళులు అర్పించారు. శోక సంద్రంలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చారు.

పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడుగా శ్రీరామ్ రాజు

నవతెలంగాణ-దుబ్బాకరూరల్



మండల పరిధిలోని రామక్కపేట గ్రామంలో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ కమిటీ సభ్యులు నూతన పద్మశాలి సంఘం అధ్యక్షులుగా శ్రీరామ్ రాజు నియామకం కాగా ఉపాధ్యక్షులుగా శ్రీరామ్ విజయకుమార్, కోశాధికారిగా కొండవీటోభని, సెక్రటరీగా చౌకి భాను కుమార్, సహా సెక్రటరీ మంతెన రాజున, దైవశెట్టి శ్రీరామ్ హరిబాబులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కమిటీ సభ్యులు అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సంతోషకరంగా ఉందని ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పద్మశాలి సమాజ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

ఉపాధ్యాయులను వినియోగించుకోవడం సరికాదు

-టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పొన్నమల్ల సత్యకృష్ణ

నవతెలంగాణ-కొండపాక



సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ సమగ్ర సర్వేకు కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను వినియోగించుకోవడం సరైనది కాదని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పున్నమల సత్య కృష్ణ, రామచంద్రం, అంజయ్య పేర్కొన్నారు. సర్వేకు కేవలం ప్రాథమిక ఉపాధ్యాయులకు కేటాయించి మధ్యాహ్నం పూట పాఠశాలలను మూసివేయడంతో ప్రాథమిక విద్యకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. నెలరోజులపాటు విద్యకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. తక్కువ రోజుల్లో పూర్తి అయ్యేలా ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను సర్వేలో ఉపయోగించుకోవాలని కోరారు. సర్వే నుంచి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని, సీనియర్ ఉపాధ్యాయులతో పాటు ఎల్ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులకు సూపర్వైజర్లుగా నియమించాలన్నారు.

జిల్లా కుమ్మర్లకు విజ్ఞప్తి



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల సమగ్ర కుల గణనను ప్రారంభించిందని, సర్వే అధికారులు మన ఇంటికి వచ్చినప్పుడు ప్రభుత్వ గజిట్‌లో ఉన్న కులానికి సంబంధించిన కాలంలో కుమ్మర కులం అని పేరు మాత్రమే రాయించుకోవాలని జిల్లా కుమ్మరి సంఘం అసోసియేట్ అధ్యక్షులు తరిగొప్పుల రామచంద్రం సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దీనివలన మన కులం యొక్క జనాభా నిక్కచ్చిగా తెలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ గజిట్‌లో లేని పేరు రాయించవద్దనీ, భవిష్యత్తులో మనకు, మన వారసత్వానికి అనేక ఇబ్బందులు రావచ్చుని, కావున ప్రతి నాయకుడు, గ్రామాల్లో ఉన్న యువకులు ప్రతి కుమ్మర కులస్తుని ఇంటి ఇంటికి వెళ్లి తప్పనిసరిగా కుమ్మర అనే పదము రాయించి వాలంటీరుగా పనిచేయాలని కోరారు.

సామాజిక కార్యకర్తను అభినందించిన తహసీల్దారు

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పాములపర్తి గ్రామ యువ నాయకులు, సామాజిక కార్యకర్త తాండ బాలకృష్ణ గౌడ్ సేవలు అభినందనీయమని మర్కుక్ మండల తహసీల్దారు ఆరిఫా అన్నారు. పాములపర్తి గ్రామంలో మర్కుక్ మండల నాయకులు సామాజిక కార్యకర్త తాండ బాలకృష్ణ గౌడ్ ఇటీవల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు.ఆయన ఆహ్వానం మేరకు బుధవారం ఆయన స్వగృహానికి వచ్చిన తహసీల్దారు ఆరిఫా మాట్లాడుతూ సమాజ సేవలో తన వంతు పాత్ర పోషిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న తండా బాలకృష్ణ గౌడ్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాండు గౌడ్, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, నాచారం దేవస్థానం మాజీ చైర్మెన్ హరి పంతులు, తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-మద్దూరు



మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 19 ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ క్రీడా సెలక్షన్లో 110 మంది క్రీడాకారులు పాల్గొనగా 40 మంది బాలబాలికలు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పిడి దామెర ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన హ్యాండ్ బాల్ క్రీడలను సిద్దిపేట హ్యాండ్ బాల్ సెక్రెటరీ దామెర మల్లేశంతో కలిసి కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేక మల్లేశం, ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా సంగారెడ్డి, సిద్దిపేట్, మెదక్ మూడు జిల్లాల నుంచి బాలురు 20 మంది, బాలి కలు 20 మంది క్రీడాకారుల ఎంపిక అయినట్లు తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 హైదరాబాదులో రాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మద్దూరు గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షులు ఎఫ్ఎం షౌకత్ అలీ, పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగులో మెలకువలు పాటించాలి

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్




ఆయిల్ ఫామ్ తోట సాగు చేసే రైతులు సరైన మెలకువలను పాటించి లబ్ధి పొందవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనాథ్ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాలలో ఆయిల్ ఫామ్ రైతులకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయిల్ ఫామ్ సాగు ఆవశ్యకత అందులో కలిగే లాభలపైన, సాగులో ఎదురయ్యే సమస్యలు ఏవిధంగా అధిగమించవచ్చో సవివరంగా రైతులకు తెలిపినట్లు వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. కార్యక్రమంలో రఘురాములు, జక్కుల సిద్దిరాములు, శ్రీహరి, సుధీర్ రెడ్డి, మొర్రి చంద్రం, అనిల్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ ప్రకారం పత్తిని విక్రయిస్తే మద్దతు ధర

-మార్కెట్ కార్యదర్శి జాన్ వెస్లీ

నవతెలంగాణ-గజ్వేల్



సీసీఐ నిబంధనల ప్రకారం పత్తిని విక్రయిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకు లభిస్తుందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారుల మాటలు విని రైతులు నష్టపోవద్దని చెప్పారు. పత్తిలో తేమ 8 శాతం మాత్రమే ఉండాలని ఇంటి వద్ద పత్తిని ఆరబెట్టుకుని రావాలని సూచించారు. 8 శాతం కన్నా ఎక్కువగా ఉంటే రూ.75 చొప్పున తగ్గిస్తారన్నారు. సీసీఐ కేంద్రం ద్వారా రైతులు పత్తిని విక్రయించుకొని సకాలంలో డబ్బులు తీసుకోవాలని కోరారు. ప్రతి నిబంధనలను పాటించాలని కోరారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుల పాలు చేసుకోవద్దని సూచించారు. రైతు కష్టాన్ని ప్రభుత్వం పరిశీలించి సీసీఐ కేంద్రాలను ప్రారంభించిందని చెప్పారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి













నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని సిద్దపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. బుధవారం సిద్ధిపేటరూరల్ మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంను పరిశీలించారు. సర్వేకు క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బంది ఉన్నాయా అని సిబ్బందిని అడిగి సర్వే చేస్తున్న తీరును పరిశీలించి ఇంటి యజమానులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ రోజు నుంచి 8 తారీకు మూడు రోజులు హౌస్ సర్వే నిర్వహించి యజమానుల పేర్లను నమోదు చేసి ఇంటింటికీ స్టిక్కర్ అతికించడం జరుగుతుందని 9వ తేదీ నుంచి ప్రభుత్వం రూపొందించిన నిర్దిష్టమైన ఫారంలో ఇంటిలోని ప్రతి ఒక్కరి సమగ్ర సామాజిక, విద్య ఉపాధి, ఉద్యోగ, రాజకీయ, కులగణన నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు కు సంబంధించిన సంపూర్ణ సమాచారాన్ని మీ వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించాలని అన్నారు. ఇంటింటి సర్వే చేసేందుకు జిల్లాలో 2538 మంది ఎన్యూమరేటర్లను, 252 మంది సూపర్వైజర్లను నియమించడం జరిగిందని ఈ సర్వేను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, నియోజకవర్గంలో స్థాయిలో ప్రత్యేక అధికారులు, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, జిల్లా ఓవరాల్‌గా జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ నోడల్ అధికారిగా ఉంటారని తెలిపారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేసి సర్వే వివరాలను ఆన్లైన్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ తహసీల్దార్ వెంకట్ రెడ్డి, సర్వే సూపర్వైజర్, ఎన్యూమరేటర్ ఉన్నారు.

రాయపోల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే అధికారులు బుధవారం ప్రారంభించారు. రాయపోల్ మండల వ్యాప్తంగా సర్వే కొనసాగుతుంది. సర్వేలో ప్రతి కుటుంబం వివరాలను సేకరించనున్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో 56 అంశాలతో పాటు 19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలతో సమాచారం సేకరించనున్నారు. సర్వే నిమిత్తం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా నియమించడంతో విద్యార్థులకు ఉదయం పూట మాత్రమే తరగతులు కొనసాగనున్నాయి. మధ్యాహ్నభోజనం అనంతరం టీచర్లు సర్వేలో పాల్గొంటారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు యథావిధిగా నడుస్తాయి. మండలంలో 63 మంది ఉపాధ్యాయులు ఎన్యుమరేటరులుగా, 6 సూపర్వైజర్లు పనిచేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు అధికారులకు అందుబాటులో ఉండి కుటుంబ వివరాలను అందించాలి.

మర్కుక్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే బుధవారం ప్రారంభించారు. మండలంలో 16 గ్రామాలకు గాను 692 కుటుంబాలకు 5 మంది సూపర్వైజర్లు, 53మంది ఎన్యుమరేటర్లతో సర్వే చేపట్టారు. వీరందరికీ మండల నోడల్ అధికారి తహసీల్దార్ ఆరిఫా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నేటి నుంచి ఈ నెల 30 వరకు సర్వే కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూరేటర్ రజిత, ఫీల్డ్ అసిస్టెంట్ అరుణ, తదితరులున్నారు

నంగునూరు: సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే బుధవారం నంగునూరు మండలంలో ప్రారంభమైంది. ఇండ్ల జాబితా సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్వే చేసే ఇంటికి స్టిక్కర్లు అతికించారు. ఈ సర్వేకు ప్రజలు పూర్తిగా సహకరించి నమోదు చేసుకోవాలని కోరారు. మండలానికి చెందిన సూపర్ వైజర్‌లు, అధికారులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో బుధవారం కులగణన సర్వే ప్రారంభమైంది. మున్సిపల్‌లో 67 మంది సిబ్బందితో ఈ సర్వే ప్రారంభించారు. అన్ని వార్డుల్లో సర్వే ఉదయం నుంచి కొందరు అధికారులు నిర్వహిస్తున్నగా ఉపాధ్యాయులు మాత్రం మధ్యాహ్నం నుంచి ఇంటింటి సర్వే చేస్తున్నారు. అంతేకాకుండా ఏడుగురు సూపర్వైజర్లను నియమించారు. ఆర్థిక సామాజిక కుల గణాంకాల సర్వేకు ప్రజలు సహకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని చేపడుతుందని అన్నారు. ప్రజలు ముందుకొచ్చి సర్వేకొస్తున్న అధికారులకు సహకరించి పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు.

కోహెడ: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే బుధవారం అధికారులు ఇంటింటికి తిరుగుతూ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. సర్వే చేసేందుకు వస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేందర్, ఎన్యుమరేటర్‌లు కొంకటి అశ్విని, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల ప్రత్యేక దృష్టి పెట్టి ఉక్కు పాదంతో అణిచివేయాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ ఏరియాను, పోలీస్ స్టేషన్ పరిధిలోని పార్ట్ 2 మ్యాప్ ను పోలీస్ స్టేషన్లో ఉండే మాల్ రూమును పరిశీలించారు. పోలీస్ సిబ్బంది కిట్ ఆర్టికల్‌ను, రెస్ట్ రూమ్లను రికార్డ్ రూమ్ను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మండల కేంద్రంలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించే వారిపై నిఘా పెంచాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై విధులు నిర్వహించాలని సూచిం చారు. స్కూళ్లు కాలేజీలు బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒక ఫిర్యాదురాలు దరఖాస్తు ఇవ్వగా ఏం జరిగింది ఎందుకు వచ్చారని వివరాలు కనుక్కొని ఆమె సమస్యను వెంటనే పరిష్కరించాలని హుస్నాబాద్ ఎస్ఐ మహేష్, సీఐ శ్రీనివాస్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపి సతీష్, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్ గౌడ్, సీసీఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, కోర్టు లైజనింగ్ ఇన్స్పెక్టర్ కమలాకర్, హుస్నాబాద్ ఎస్ఐ మహేష్, అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్, కోహెడ ఎస్ఐ అభిలాష్, సీసీ నితిన్ రెడ్డి ఉన్నారు.

ఉద్యోగ నిర్వహణలో పదవి విరమణ సహజం

నవతెలంగాణ-సిద్దిపేట



ఉద్యోగ నిర్వహణలో ఉద్యోగికి పదవి విరమణ సహజమని ఏకలవ్య ఎరుకల (వెల్ఫేర్) సంఘం సిద్దిపేట అధ్యక్షులు కెమ్మసారం రాజేష్ ఖన్నా అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏకలవ్య సంక్షేమ భవనంలో గౌరవ అధ్యక్షులు కెమ్మసారం పోచయ్య, మురళి, ఎల్లయ్య, దుర్గయ్యలతో కలిసి ఇటీవల టీజీఎస్ఆర్టీసీ డ్రైవర్‌గా పదవి విరమణ పొందిన కెమ్మసారం ఎల్లయ్య రాజమణి దంపతులను పూలదండలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు సుదీర్ఘకాలంగా ఉత్తమ సేవలందించినా వ్యక్తి ఎల్లయ్య అని అన్నారు. ఎల్లయ్య ఉద్యోగం సాధించినప్పుడు ఎన్నో ఒడిదుడుకులకు గురయ్యారాని, వాటన్నిటిని ఆయన ఎదుర్కొని కృషి, పట్టుదలతో, ఉద్యోగాన్ని అంకిత భావంతో, బాధ్యతగా 30 ఏండ్లు నిర్విరామంగా సంస్థకు సేవలందించి ఐదు సార్లు ఉత్తమ అవార్డులు అందుకొని అందరు మన్ననలు పొందినా వ్యక్తికి పదవి విరమణ సందర్భంగా ఆయనకు సన్మానం చేయడం సంతోషంగా ఉదన్నారు. ఆయన శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఎరుకల (వెల్ఫేర్) సంఘం ప్రధాన కార్యదర్శి కెమ్మసారం నాగరాజు, కోశాధికారి నర్సింలు, సహాయక కోశాధికారి నర్సింలు, సభ్యులు రాజు, నవీన్, సంతోష్ కుమార్, శ్రవణ్ కుమార్, కూరాకుల చంద్రం, పోచయ్య, పెంటయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు

నవతెలంగాణ-మర్కుక్



ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా కొనసాగుతున్నాయని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమై రోజులు గడుస్తున్న ఇప్పుడిప్పుడే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవి కూడా మొక్కుబడుగానే కొనసాగుతున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గజ్వేల్ నియోజకవర్గంలో 111 ధాన్యం కొలుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని కేంద్రాలకు అవసరమైన మిషనరీలతో పాటు గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచడంతోపాటు కేంద్రానికి ఒక ప్రభుత్వ అధికారిని నియమించి పర్యవేక్షించడం జరిగిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా ఉన్నాయన్నారు. అలాగే సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ కొన్ని కాటన్ మిల్లులలోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అయ్యాయని అన్ని కాటన్ మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి రైతుకు మద్దతు ధర చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ గజ్వేల్ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అచ్చం గారి భాస్కర్, బీఆర్ఎస్ నాయకులున్నారు.

గురుకుల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

నవతెలంగాణ- గజ్వేల్



గురుకుల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ, వాటిని నిర్వీర్యం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో జరుగుతున్న వరుస సంఘటనల వల్ల పిల్లల్ని చదివించాలంటేనే భయపడే పరిస్థితులు గురుకులాల్లో నెలకొన్నాయని అన్నారు. గురుకుల విద్యాలయాలన్నీటిని సమస్యల కూపంలోకి నెడుతూ వాటిని పర్యవేక్షించే దిక్కు లేక నిర్వీర్యం చేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఇవాళ ఎలుకలు కరిచే పరిస్థితికి గురుకులాల్ని దిగజార్చారన్నారు. గురుకుల విద్యార్థులు సరైన ఆహారం అందక ఆసుపత్రి పాలయ్యే దుస్థితికి తీసుకువచ్చారన్నారు. వెంటనే గురుకులాల్లో హెల్త్ సూపర్వైజర్లను నియమించడంతోపాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించి అదేవిధంగా పౌష్టికాహారం కల్తీ లేకుండా పిల్లలకు అందించాలని కోరారు. పదేపదే గురుకులాల్లో వరస సంఘటనలు జరుగుతున్న విద్యార్థుల ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందన్నారు. వెంటనే ముఖ్యమంత్రి గురుకులాల్లో జరుగుతున్న సంఘటన మీద సమీక్షించి వారికి కావలసిన అన్ని వసతుల్ని కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

హై టెన్షన్ విద్యుత్ స్తంభాల నిర్మాణం తగదు

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని గణేష్ పల్లి గ్రామంలో ఇండ్ల మధ్య నుంచి హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు నిర్మాణాలు చేపట్టడం తగదని గ్రామస్థులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గణేష్ పల్లి గ్రామం మధ్యలో నుంచి భారీ హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు నిర్మాణం చేస్తే ప్రజలకు ఇబ్బందిగా మారుతుందన్నారు. ఇప్పటికే గ్రామంలో విద్యుత్ స్తంభాలతో వాహనాలకు ఇబ్బందిగా మారిందని, పాత స్తంభాలు కాకుండా మళ్ళీ కొత్తగా భారీ హై టెన్షన్ స్తంభాలను ఏర్పాటు చేయడానికి గుంతలు తీయటం నిపిలివేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు గ్రామం మధ్య నుంచి కాకుండా గ్రామం బయట నుంచి ఈ హై టెన్షన్ విద్యుత్ స్తంభాల నిర్మాణం ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ టవర్ల నిర్మా ణం వల్ల భవిష్యత్తు తరాలకు ప్రమాద భరితంగా మారు తుందని దయచేసి గ్రామం వెలుపల నుంచి విద్యుత్ స్తంభా లను ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

కొనుగోలును వేగవంతం చేయాలి

నవతెలంగాణ-మిరుదొడ్డి



రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ పీడీ జగదేవ్ ఆర్య అన్నారు. బుధవారం మీరుదొడ్డి మండలం ధర్మారం మల్లుపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. పండించిన ప్రతి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళాలను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతు ఖాతాలోనే నేరుగా డబ్బులను జమ చేయడం జరిగిందని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీపీఎం రాజయ్య ఎంపీడీవో గణేష్ రెడ్డి ఏపీవో సుభాష్, ఏపీఎం దాకయ్య, సీసీలు బాలరాజు, వైకుంఠం టెక్నికల్ అసిస్టెంట్లు , ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ- రాయపోల్



రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఎన్నో అమలుగాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఇప్పుడు హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని రాయపోల్ బీజేపీ మండల అధ్యక్షులు రాజాగారి రాజా గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజులలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అలవిగాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ ప్రక్షాళన, హైడ్రా కూల్చివేతలు అంటూ కాలయాపనం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 4 వేల పెన్షన్ ఇస్తామని, 2వేల పెన్షన్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. రైతు భరోసా 15 వేలు ఇస్తామని రెండు పర్యాయాలు ఇవ్వకుండా ఎగొట్టారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇప్పటివరకు పూర్తి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నరేష్ గౌడ్, ఓబీసీ మండల అధ్యక్షులు స్వామి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షాదుల్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



నవతెలంగాణ-గజ్వేల్

విద్యార్థినీ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో చెస్ క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో దాదాపు 200 మంది క్రీడాకారులు వివిధ ప్రాంతాల నుంచి పాల్గొనగా వారికి చెస్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన కొంతమంది విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. తూముకుంటలో శుక్రవారం జరిగే రాష్ట్రస్థాయిలో చెస్ పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాజమౌళితో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు విద్యతోపాటు క్రీడలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, చదరంగం పోటీల్లో పాల్గొని గజ్వేల్ సత్తా చాటాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ ఎలియాస్ రావు మాట్లాడుతూ, చదరంగం క్రీడ విద్యార్థిని విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్రస్థాయిలో నిర్వహించే చెస్ పోటీలకు గజ్వేల్ ప్రాంతం నుంచి సెలెక్ట్ అయిన విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జకియుద్దిన్, కిషన్ రెడ్డి, చందు, పీఈటీలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్ : రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట అర్బన్ మండల ఇన్సాన్ పల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్, ఎంపీటీసీ నాగుల స్రవంతి ప్రశాంత్, వైస్ ఎంపీపీ ఎల్లం అన్నారు. బుధవారం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ మధ్యవ ఓర్తులను నమ్మి రైతులు మోసపోవద్దని నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా తేమశాతం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు రైతులు పాల్గొన్నారు.

దళారి వ్యవస్థ నియంత్రణకు సహకరించాలి

నవతెలంగాణ-బెజ్జంకి



ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు వరిధాన్యం, సీసీఐ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు పత్తిని విక్రయించి దళారి వ్యవస్థ నియంత్రణకు సహకరించాలని ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ బుధవారం కోరారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని దళారి వ్యవస్థ నియంత్రణలో రైతులు బాగాస్వాములవ్వాలని పులి క్రిష్ణ సూచించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మిరుదొడ్డి

అనారోగ్యంతో మృతి చెందిన సర్వేల బాలవ్వ కుటుంబాన్ని మాజీ ఉపసర్పంచ్ గురుక పరుశరా ములు పరామ ర్శించి, ఆర్థిక సాయం అదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె మరణం బాధాకరమన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఆయన వెంట దీపంపల్లి కనకయ్య, బోయిని రామస్వామి, తంగళ్లపల్లి బైరవ చారి, పాలమాకుల అరుణ్ కుమార్, రెడ్డిపల్లి సురేందర్ రెడ్డి, దీపంపల్లి నాగరాజు, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ-ములుగు

మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఎమ్మార్వో ప్రవీణ్ రెడ్డి, వ్యవసాయ అధికారి ప్రగతి, ఎంపీడీవో శర్మ కొక్కొండ క్లస్టర్ ఏఈఓ నివేదిత, బుధవారం మండలంలోని ములుగు, సింగన్న గుడ, నర్సాపూర్, తునికి బొల్లారం, క్షీరసాగర్, కొట్యాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారులను నమ్మి ధాన్యాన్ని విక్రయించవద్దని, ఆరు నెలల కాలం పాటు పండించిన ధాన్యాన్ని రైతులు దళారుల చేతిలో పెట్టి మోసపోవద్దని, త్రాసు విషయంలో ఎలాంటి లోపాలు ఉన్నా గాని అధికారుల దృష్టికి తీసుకురావాలని ములుగు పీఏసీఎస్ సీఈవో రమేష్ బాబు అన్నారు .ఈ కార్యక్రమంలో నర్సాపూర్ తాజా మాజీ ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ బాలేష్, ఏఎంసీ డైరెక్టర్లు బాలయ్య రాములు గౌడ్ తదితరులున్నారు.

చెకుముకి సైన్సు సంబురాలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-గజ్వేల్



చెకుముకి సైన్స్ సంబరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టుగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మహేంద్రం తెలిపారు.గత వారం రోజుల నుంచి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష తెలంగాణ ప్రభుత్వం సహకారంతో అన్ని మండలాలలో చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక నిర్వాహకులు తెలిపారు. అన్ని ఉన్నత ప్రభుత్వ ప్రయివేట్, ఆశ్రమ, గురుకుల, ఆదర్శ, కేజీబీవీ, పాఠశాలల్లో చదువుతున్న 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం బాలరాజు, జిల్లా అధ్యక్షులు తుమ్మ సత్యం , ప్రధాన కార్యదర్శి కనకరాజు , కోశాధికారి అజీజ్ , ఉపాధ్యక్షులు ప్రశాంత్ ,సి హెచ్ రామచంద్రం , శాస్త్ర ప్రచార కమిటీ కన్వీనర్ సాదత్అలీ , విద్యా విభాగం కన్వీనర్ మహేందర్ ,కార్యదర్శి బాలకిషన్ లింగాల యాదగిరి కే రామచంద్రం శ్రీనివాస్, తెలియజేశారు.

తేమ శాతం తక్కువ ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

నవతెలంగాణ-టేక్మాల్



తేమ శాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం. కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలు భాగంగా టేక్మాల్ మండలం ఎల్లుపేట్‌లోని ఐకెపి వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డిఆర్డిఓ శ్రీనివాసరావు తహసీల్దార్‌తో కలిసి సందర్శించిన కొనుగోలు సమర్థవంతంగా నిర్వహణకు పలు సూచన చేశారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. తూకం విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. .రైతులు దళారులకు నమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కోరంపల్లి గ్రామంలో ఇంటింటా సర్వేను పరిశీలించారు. ప్రజలందరూ సర్వేకు సహకరించాలని కోరారు. సర్వే కోసం ప్రభుత్వ అధికారులు ఇంటి వద్దకు వచ్చినప్పుడు అన్ని ఆధారాలు చూపించాలని చెప్పారు. ఈ సర్వే పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓపిడి శ్రీనివాసరావు, టేక్మాల్ తహసీల్దార్ సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారులు తదితరులు పాల్గొన్నారు...........

ఈపీఎఫ్ తరలించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేట

ఈపీఎఫ్ కార్యాలయాన్ని సిద్దిపేట నుంచి తరలించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘం అధ్యక్షులు ఇదారి మల్లేశం అధికారులను కోరారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘం కార్యాలయంలో హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా ఆఫీస్ బేరర్స్ ముఖ్య సమావేశం జరిగింది. అనంతరం ఈపీఎఫ్ కార్యాలయాన్ని తరలించవద్దని సిద్దిపేటలోని రీజనల్ పీఏఫ కమిషనర్ కే. అవినాష్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో ఉన్న ఈపీఎఫ్ కార్యాలయాన్ని సిద్దిపేట నుంచి తరలించాలని కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడం చాలా బాధాకరమన్నారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి నుంచి కార్యాలయాన్ని తరలించినట్లయితే ఇప్పుడు ఉన్న వృద్ధాప్య కార్మికుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. అంతేకాకుండా సిద్దిపేట పట్టణంలో ఉన్నటువంటి పీఏఫ్ కార్యాలయం సొంత భవనంలోనే ఉందని, ఇది అద్దె భవనం కాదని, ప్రభుత్వాలకు ఇబ్బంది ఏమిటి అని ప్రశ్నించారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఈపీఎఫ్ కార్యాలయాన్ని సిద్దిపేట పట్టణంలోనే ఉండే విధంగా కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, లేనియెడల కార్మికుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు, కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకులు స్వామి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు నీటి సౌకర్యం కల్పించిన సీఎన్ఆర్ ఫ్యామిలీ

-కృతజ్ఞతలు తెలిపిన హెచ్ఎం మల్లికార్జున్



నవతెలంగాణ-దుబ్బాకరూరల్

దుబ్బాక మండల పరిధిలోని పద్మనాభునిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లగా సీఎన్ఆర్ ఫ్యామిలీ పాఠశాలకు బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్‌తో కలిసి సీఎన్ఆర్ ఫ్యామిలీ మెంబర్ గన్నెబోయిన సతీష్ గౌడ్ పనులు ప్రారంభించారు. విద్యార్థుల సమస్యను దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కరించడానికి కృషి చేసిన సీఎన్ఆర్ ఫ్యామిలీకి విద్యార్థుల పక్షాన హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత కంఠక్కొయ్య రాజశేఖర్, నవీన్, కర్నాకర్, బాబు, అశోక్, పాఠశాల సిబ్బంది ఉన్నారు

ఇల్లు దగ్ధమైన కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-రాయపోల్

ఇటీవల విద్యుత్ షాక్‌తో ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధమైన కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు గాజులపల్లి తాజా మాజీ సర్పంచ్ అప్పవారి శ్రీనివాస్. బుధవారం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తో ఇల్లు దగ్ధమైన మారుపాక అర్జున్ కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదంలో అర్జున్ ఇంట్లో ఉన్న బియ్యం, సరుకులు, బట్టలు, డబ్బులు, నగలు పూర్తిగా ఖాళీ బూడిదైపోయాయి. వారి కుటుంబానికి తమ వంతు సహకారంగా అందజేయడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వం అర్జున్ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బాసంగారి నర్సవ్వ నరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు మారుపాక కనకయ్య, పంజ మల్లేశం, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం

నవతెలంగాణ-రాయపోల్



దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అధికారులు ప్రారంభిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే అధికారులు బుధవారం ప్రారంభించారు. దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా సర్వే కొనసాగుతుంది. సర్వేలో ప్రతి కుటుంబం వివరాలను సేకరించనున్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో 56 అంశాలతో పాటు 19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం 75 ప్రశ్నలతో సమాచారం సేకరించనున్నారు. సర్వే నిమిత్తం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా నియమించడంతో విద్యార్థులకు ఉదయం పూట మాత్రమే తరగతులు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నభోజనం అనంతరం టీచర్లు సర్వేలో పాల్గొంటారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు యథావిధిగా నడుస్తాయి. గ్రామాలలో ప్రజలు అధికారులకు అందుబాటులో ఉండి కుటుంబ వివరాలను అందించాలి.

సర్వేలో పేరు చివర ముదిరాజ్‌గా నమోదు చేసుకోవాలి

-రాష్ట్ర ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పిల్లి నర్సింలు

నవతెలంగాణ-సిద్దిపేట



ముదిరాజుల ఐక్యత తెలపడానికి ముదిరాజ్ ముద్దుబిడ్డలు తమ పేరు చివరన ముదిరాజ్ అనే గర్వంగా చెప్పుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పిల్లి నర్సింలు అన్నారు. బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కుల గణన సర్వేలో ముదిరాజ్‌లో వివిధ వర్గాలు ఉన్న కూడా ముదిరాజ్ అని నమోదు చేపించుకోవాలని, అప్పుడే ముదిరాజుల సంఖ్య తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి శ్రీశైలం ముదిరాజ్, నాయకులు పిల్లి నారాయణ, సిద్ధిరాములు, నర్సింలు, బైరి సాయిచరణ్ ముదిరాజ్, దుర్గం రాజు, వెంకటేష్, నీలం రవి ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి రాష్ట్రస్థాయి రగ్బీకి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-సిద్దిపేట



మెదక్ జిల్లా చేగుంట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన 68వ పాఠశాల క్రీడా సమాఖ్య రగ్బీ పోటీలలో అండర్ 14 విభాగంలో గన్నె నమృత్యోదన్ రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ అహమ్మదుల్లా బెగ్లు తెలిపారు. అకాడమిక్ ఇంచార్జి కర్నాకర్ రెడ్డి, ఏ.ఓ. రాజయ్య, జోనల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జెల్లా సాగర్, వ్యాయామ ఉపాధ్యాయులు బుస మహేష్, మల్లిక, సతీష్, ప్రవళిక, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

కుల గణనకు ప్రతి ఒక్కరు సహకరించాలి

-తెలంగాణ దేశానికే ఆదర్శం రోల్ మోడల్
-నేషనల్ వారియర్స్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గజబింకార్ అశోక్

నవతెలంగాణ-మిరుదొడ్డి

కుల గణన ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వ ఫలాలు అన్ని వర్గాలకు అందుతాయని సామాజిక అసమానతలు లేకుండా చేసే అవకాశం ఉందని నేషనల్ వారియర్స్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గజబింకార్ అశోక్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రమైన అక్బర్ పేట గ్రామంలో మాట్లాడుతూ కుల గణన చేస్తామని గత ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా హామీ ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీని నేర వేరుస్తు న్నామన్నారు. నేడు కుల గణన ద్వారా దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ప్రజలు కూడా కుల గణనకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కోరారు.



మల్లంరాజు విగ్రహంకు భూమి పూజ

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ మండలం కొలుగూరు గ్రామ తాజా మాజీ సర్పంచ్ మల్లంరాజు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గ్రామంలో తన తండ్రి విగ్రహం ఏర్పాటు చేయాలని భావించి ఆయన కూతురు మల్లం పూజ ఆధ్వర్యంలో బుధవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో బాలవికాస్ కేంద్రం సమీపంలో దీని ఏర్పాటు చేసేందుకు కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.